ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Hyderabad, Vijayawada,Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 35 పేజీలు: 8+16 వెల: 6.50


మధ్యప్రాచ్య దేశాలకు విమాన సేవలు పునరుద్ధరణ 8లో

నేపాల్‌లో ఆర్ఎస్‌పి ప్రభంజనం

## టాప్-100లో తెలుగువారు ఒక్కరే..

# సివిల్స్‌లో 958 మంది ఎంపిక

### టాపర్‌గా రాజస్థాన్‌కు చెందిన అనూజ్ అగ్నిహోత్రి

### 55వ ర్యాంక్ సాధించిన గూడెల్లి సృజన

### 2025 ఫలితాలు ప్రకటించిన యుపిఎస్‌సి



1-అనూజ్ అగ్నిహోత్రి



2-రాజేశ్వరి సువే



3-ఆకాన్ష్ ధుల్



55-గూడెల్లి సృజన

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 6:** అఖిల భారత సర్వీసులైన ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) నిర్వహించే సివిల్స్ సర్వీసెస్-2025 పరీక్ష తుది ఫలితాలు విడుదలయ్యాయి. 1087 పోస్టులకు పరీక్షలను నిర్వహించగా 958మందిని ఎంపిక చేశారు. అర్హులైన వారు లేకపోవడంతో మరో 129 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు. సివిల్స్‌లో టాపర్‌గా రాజస్థాన్‌కు చెందిన అనూజ్ అగ్నిహోత్రి నిలిచారు. ఇతను మెడికల్ విద్యార్థి కావడం విశేషం. సివిల్స్-2025లో ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు తెలుగు వారు కూడా సివిల్స్‌లో ర్యాంకులు సాధించారు. సివిల్స్-2025 ఫలితాలను యుపిఎస్‌సి శుక్రవారం విడుదల చేసింది. అనూజ్ అగ్నిహోత్రి మొదటి ర్యాంకు సాధించగా, రాజేశ్వరి సువే రెండో ర్యాంక్, ఆకాన్ష్ ధుల్ 3వ ర్యాంక్, రాఘవ్ ఝున్‌ఝున్ వాలా 4వ ర్యాంక్, ఇషాన్ భట్నాగర్ 5వ ర్యాంక్ సాధించారు. ఆలిండియా టాపర్ అనూజ్ అగ్నిహోత్రి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా రహతా గ్రామానికి చెందిన యువకుడు. జోధ్‌పూర్ >>2

## గ్రామీణాభివృద్ధికి బడ్జెట్ ఊతం

# సేద్యంలో సాంకేతిక విప్లవం

### ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

### 30 కోట్ల భూముల డిజిటల్ సర్వే పూర్తి

### గ్రామీణ పరివర్తనపై ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మార్చి 6:** వ్యవసాయ రంగ నిపుణులు, పరిశ్రమలు, రైతులు సమన్వయంతో పనిచేస్తేనే భారత వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేయగలమని, క్వాలిటీ బ్రాండింగ్, అంతర్జాతీయ ప్రమాణాల సాకారం కోసం అందరూ కలిసి పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. దేశంలోని వైవిధ్యంతో కూడిన వాతావరణ పరిస్థితులను రైతులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన మూడో వెబినార్‌లో 'వ్యవహాయం, గ్రామీణ పరివర్తన' అనే అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో రసాయన రహిత సాగుకు భారత్ పెద్దపీట వేయాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ కావచ్చని, దీని కోసం అవసరమైన సర్టిఫికేషన్, ల్యాబొరేటరీ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని వివరించారు. కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడటం రైతులకు నష్టదాయకమని, అందుకే పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని ఆయన కోరారు. భారత సుదీర్ఘ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయం ఒక వ్యూహాత్మక మూలస్తంభమని ఆయన నొక్కి చెప్పారు. అలాగే నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, పప్పుధాన్యాల సాగు ద్వారా వ్యవసాయరంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టేలా రాష్ట్రాలను ప్రోత్సహిం >>2



క్యాతనపల్లి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక 3 వారాల్లో..

ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి6:** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్థంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతన పల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

# పంచడానికి భూముల్లేవు

### చదువు ఒక్కటే ఇవ్వగలిగిన ఆస్తి

### నెలకు వెయ్యి కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తున్నాం

### ఎన్నికల్లో ప్రజా మద్దతుతో గెలిచాం

### మాదిగ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం హైదరాబాద్ మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి6:** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని, ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో సిఎంకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే 2023 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని, కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. మహాభారతంలో కర్ణుడు, బార్బరికుడి మాదిరిగా >>2

## ఉష్ణోగ్రతలు పైపైకి

### ఆరు జిల్లాల్లో 40 డిగ్రీలు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణ నిప్పుల కొలిమిలా మారింది. భానుడి ప్రతాపానికి రాష్ట్రంలో రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సిద్దిపేట, జనగామ, వరంగల్, మహబూబాబాద్, యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట మినహా మిగతా అన్ని జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటాయని అధికారులు స్పష్టం చేశారు. ములుగు, ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి తదితర జిల్లాల్లో ఎండలు మండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ >>2

## 99 రోజుల వినూత్న కార్యక్రమం

### రాష్ట్రమంతటా 'ప్రజాపాలన-ప్రభుత్వ ప్రణాళిక'

### రెండు ప్రాజెక్టులను ప్రారంభించిన సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి6: రాష్ట్రమంతటా ప్రజాపాలన-ప్రభుత్వ ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ముందస్తు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో ప్రతి గ్రామం, వార్డు నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ అభివృద్ధికి కీలకమైన రెండు ముఖ్యమైన ప్రాజెక్టులకు నాంది పలికారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బుద్వేల్ వద్ద ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌కు శంకుస్థాపన చేశారు. కోత్వాల్‌గూడ వద్ద ఎకోహిల్ పార్క్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌ను మరింత ఆధునికంగా, సుస్థిరంగా, ఆహ్లాద నివాసంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడుతాయి. గ్రేటర్ సిటీ పరిధిలో రోడ్ల రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం దాదాపు రూ. 24,500 కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపడుతోంది. రీజనల్ రింగ్ రోడ్డు దేశంలోని మెట్రో సిటీలు అన్నింటిలో హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. 158 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్ ఇప్పటికే అందుబాటులో ఉంది. దీనికి కొనసాగింపుగా త్వరలోనే 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కలిపే 10 కొత్త గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి హెచ్ఎండిఏ 11,500 చదరపు కిలోమీటర్ల >>2

## మూసీ చుట్టూ 'నైట్ టూరిజం'

### బుల్లెట్ ట్రైన్ హబ్‌గా శంషాబాద్

### ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్

### కొత్వాల్‌గూడ ఎకోపార్క్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి




శుక్రవారం ఎకోపార్కును ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి6:** మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకోహిల్స్ పార్క్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా షూటింగ్ ల కోసం విదేశాలకు పోతున్నారు..హైదరాబాద్ కంటే సుందరమైన నగరం దేశం లోనే లేదు..మంచి ప్రభుత్వం ఉంటే ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసుకోవచ్చు అని చెప్పారు. చంద్రబాబు, వైఎస్ సమయంలో నగరానికి కృష్ణా, గోదావరి నీళ్లు నగరానికి తీసుకువచ్చారు అని చెప్పారు. నాటి నిజాం నవాబు ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో వరదల నివారణకు మూసి పైన నిర్మాణాలు చేపట్టారు..వికారాబాద్ లో నిజాం నవాబు మెడిసిన్ ప్లాంట్ లు నాటారు అని పేర్కొన్నారు. ఉస్మానియా హాస్పిటల్, గోల్కొండ, అసెంబ్లీ లాంటి చారిత్రాత్మక కట్టడాలు హైదరాబాద్ లో ఉన్నాయి అని పేర్కొన్నారు. అయితే హైదరాబాద్ ఆక్రమణలు, చెత్త తో నిండిపోయింది, గొప్ప సుందరమైన నగరం హైదరాబాద్ నగరాన్ని మంచిగా చేస్తానంటే వాళ్ళు ఒప్పుకోవడం లేదు..మేము చేయలేదు నువ్వు చేయొద్దని అంటున్నారు వాళ్లకు ఫామ్ హౌస్‌లు వచ్చాయి, ఫామ్‌హౌస్‌లో ఉన్న వారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని బిఆర్ఎస్ నేతల >>2

## 14 నుంచి టెన్త్ పరీక్షలు

### 2676 కేంద్రాలు ఏర్పాటు, హాజరు కానున్న 5.28లక్షల విద్యార్థులు


**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 6:** రాష్ట్రంలో మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకి 5,28,239 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వారికి సంబంధించిన హాల్ టికెట్లను గురువారం నుంచే ఎస్ఎస్‌సి బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను డైరక్టర్ శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఎస్ఎస్‌సి బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ తెలిపారు. విద్యార్థులకు జారీ చేసే హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌తో ఉండనుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను పొందడం కోసం 8096958096 వ్యాట్సాప్ నంబర్‌కి హాయ్ అని టైప్ చేసి వెంటనే ఎస్ఎస్‌సి హాల్ టికెట్ మార్చి-2026 అని సెండ్ చేస్తే హాల్ టికెట్‌ను సెండ్ చేయనున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని, వారికి ఎంత దూరంలో ఉందో కూడా తెలుస్తుంది. తద్వారా వారు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ముందుగానే ప్లాన్ చేసుకునే వెలుసుబాటు కలగనుంది. రాష్ట్రంలో ఈ ఏడాది ఎస్ఎస్‌సి పరీక్షలకు 5,28,239మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో >>2

# ఇరాన్ లొంగిపోవలసిందే

### ఎలాంటి చర్చలు ఉండవు: ట్రంప్

### ఏడవరోజున కూడా సాగిన భీకర పోరు

### గల్ఫ్‌లోని చమురుశుద్ధి కేంద్రాలే ఇరాన్ టార్గెట్




టెహ్రాన్‌లో బాంబు దాడులకు పెద్దఎత్తున వ్యాపించిన పొగలు

**టెహ్రాన్/జెరూసలెం/వాషింగ్టన్, మార్చి 6:** మధ్యప్రాచ్యదేశాల్లో ప్రచ్ఛన్న యుద్ధం మరింత తీవ్రం అవుతోంది. అటు ఇరాన్, ఇటు అమెరికా, ఇజ్రాయెల్‌లు భీకర దాడులుచేస్తున్నాయి. మరోపక్క అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో ఎలాంటి చర్చలు ఉండవని, బేషరతుగా ఇరాన్ లొంగిపోవాల్సిందేనంటూ ట్రంప్ హెచ్చరికలతోకూడిన సందేశాలు విడుదలచేసారు. తన సొంత సోషల్‌మీడియా ట్రూత్‌తో గంటకొక కొత్త సందేశం వస్తోంది. అలాగే ఇరాన్‌సైతం యుద్ధం కొనసాగుతునప్పటికీ కొన్ని దేశాలు దౌత్యపరంగా చర్చలకు ప్రయత్నిస్తున్నాయని, త్వరలో కొంతమేర తగ్గవచ్చని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌ప్రకటించారు. అయితేఇవేమీ ఉండవని ఇరాన్‌లో ఎవరున్నా తన ప్రమేయం తప్పనిసరి అని ట్రంప్ చెపుతూ కొత్తగా ఎన్నికైన సుప్రీం కమాండర్ ముజ్తబా ఖమైనీని తాము అంగీకరించబోమని, నియంత వార సులను అంగీకరించేదిలేదని ట్రంప్‌స్పష్టంచేసారు. ఇరాన్ >>2



శుక్రవారం అల్లు శిరీష్ వివాహానికి హాజరైన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి చిత్రంలో నూతన దంపతులు, అల్లు అర్జున్, అల్లు అరవింద్

## 99 రోజుల వినూత్న కార్యక్రమం

>> విస్తీర్ణానికి కాంప్రెహెన్సివ్ మాస్టర్ ప్లాన్-2050 తయారు చేస్తోంది. ఆధునిక జిఐఎస్ టెక్నాలజీ, 3డి డిజిటల్ ట్విన్ వంటి సాంకేతికతలను ఉపయోగించి నగర ప్రణాళిక రూపొందిస్తోంది.ప్యారడైస్ జంక్షన్ నుంచి డైరీ ఫార్మ్ రోడ్ వరకు దాదాపు అయిదున్నర కిలో మీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పను లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్యారడైస్ నుంచి షామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు మరో ఎలివేటర్ కారిడార్‌తో పాటు మొత్తం 18 కిలో మీటర్ల కారిడార్ అభివృద్ధి జరుగుతోంది. ఈ రెండు ప్రాజెక్టులకు మొత్తం 169 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమైంది. కేంద్ర ప్రభుత్వంతో పలుమార్లు సంప్రదింపులు జరిపి రక్షణ శాఖతో ఒప్పందం చేసుకొని ఈ భూమిని సాధించుకు న్నాం. బంజారాహిల్స్ రోడ్ నం.12 నుంచి గచ్చిబౌలి ఓఆర్ఆర్‌వరకు 9 కిలోమీటర్ల పొడవున 6 లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపడుతున్నాం. ఫిల్మ్‌నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి ప్రాంతాలకు నేరుగా కనెక్టివిటీ కల్పిస్తుంది. నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్: కోకాపేట్ నియోపోలిస్ లేఅవుట్‌కు ఓఆర్ఆర్‌తో నేరుగా కనెక్టివిటీ కల్పించేందుకు రూ.65 కోట్లతో ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌ను గత ఏడాది ప్రారంభమైంది. ఈ లేఅవుట్‌లో ఈఆక్షన్ నిర్వహిస్తే గతం కంటే 87 శాతం ఎక్కువ రేట్ల కు అమ్ముడయ్యాయి. రేడియల్ రోడ్లు.. రతన్ టాటా రోడ్ రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి అమంగ ల్ ఆర్ఆర్ఆర్ వరకు 41.5 కిలోమీటర్ల ఎక్స్‌ప్రె స్ వే అభివృద్ధి చేస్తున్నాం. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.4,621 కోట్లు. రేడియల్ రోడ్-2కోత్వాల్ గూడ నుంచి నాచారం వరకు 81 కిలోమీటర్ల పొడవున ఈ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఇది 3 ప్రధాన పారిశ్రా మిక కేంద్రాలకు కనెక్టివిటీగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.12,000 కోట్లు. ఇంటర్‌చేంజ్ మరియు రేడియల్ రోడ్-2ను కలుపుతూ బుద్వేల్ లేఅవుట్, రాజేంద్రనగర్ ప్రాంతాల మధ్య రవాణాకు కీలకంగా ఉంటుంది.



శుక్రవారం టెహ్రాన్‌లో బాంబు దాడికి గురైన బాధితులను స్ట్రెచర్‌పై తీసుకు వెళ్తున్న దృశ్యం

# ఇంజినీరింగ్ మరింత భారం!

## ఫీజులు భారీగా పెంపు

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 06: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు కొత్త ట్యూషన్ ఫీజులను నిర్ధారిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో సీబీఐటీకి అత్యధికంగా రూ. 1.83 లక్షల ఫీజును నిర్ణయించింది. లక్షకిపైగా ఫీజును 33 కాలేజీలకు నిర్ణయించగా.. రెండు కాలేజీలకు రూ. లక్షగా నిర్ణయించింది. గత 2022-23 నుంచి 2024-25 బ్లాక్ పిరియడ్‌లో నిర్ణయించిన ఫీజుల కంటే కొన్ని కాలేజీలకు తగ్గించగా.. మరికొన్ని కాలేజీలకు ఫీజులను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 160 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు బ్లాక్ పిరియడ్ 2025-26 నుంచి 2027-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించిన ట్యూషన్ ఫీజులను నిర్ణయిస్తూ జీవో ఎంఎస్ నంబర్ 6ను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా జారీ చేశారు. కొత్తగా నిర్ణయించిన ఫీజుల ప్రకారం సీబీఐటీకి రూ.1.83 లక్షలుగా నిర్ణయించగా, వాసవి కాలేజీకి రూ.1.75 లక్షలతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) ఇప్పటివరకు 19 కళాశాలల్లో ఉన్న ట్యూషన్ ఫీజులను తగ్గిస్తూ, 70 కళాశాలలకు ఫీజును పెంచకుండా గత ఫీజునే ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఏఎఫ్ఆర్‌సి పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ జీవో ఎంఎస్ నంబర్ 6ను జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు కనీస ట్యూషన్ ఫీజు రూ.45,000 నిర్ణయించగా.. 21 కాలేజీలకు మినిమమ్ ఫీజును ఖరారు చేశారు. కొత్తగా నిర్ణయించిన ఫీజులు ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26 నుంచే అమలులోనికి రానున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్ 2025-26, 2026-27, 2027-28 విద్యా సంవత్సరాల్లో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ ఫీజులు వర్తిస్తాయి. నాలుగు సంవత్సరాల పాటు ఇవే రుసుములను విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఈసారి 19 కాలేజీలకు గత బ్లాక్ పిరియడ్ కంటే ఫీజును తగ్గించారు. గత విద్యా సంవత్సరం 2024-25 వరకు ఉన్న ఫీజులో ఏఎఫ్ఆర్‌సి కోత పెట్టింది. గత ఆగస్టులో జరిగిన ఎప్‌సెట్‌కౌన్సెలింగ్ సందర్భంగా విద్యార్థుల నుంచి పాత ఫీజులనే వసూలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఫీజులను నిర్ణయించిన తర్వాత ఒకవేళ తగ్గితే ఆ వ్యత్యాసాన్ని వెనక్కి చెల్లించాల్సి ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ కౌన్సిలింగ్ సందర్భంగా స్పష్టం చేసింది. దీంతో 19 కాలేజీల్లో ఫీజు తగ్గడంతో అక్కడ సొంతంగా ఫీజు చెల్లించే వారికి ఆయా కాలేజీలు ఆ వ్యత్యాసం మొత్తాన్ని వెనక్కి ఇవ్వాల్సి ఉంటుంది.

**రూ.లక్ష దాటిన ఫీజులున్న కళాశాలు.. (రూ. లక్షల్లో)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| సిబిఐటి | 1.83 | వాసవి | 1.75 | ఎంజిఐటి | 1.67 |
| సీవీఆర్ | 1.63 | గోకరాజు | 1.61 | నారాయణమ్మ | 1.62 |
| ముఫకంజా | 1.25 | విజ్ఞాన్ | 1.23 | గీతాంజలి | 1.21 |
| ఏఎస్ | 1.10 | జేబీఐటీ | 1.10 | శ్రీఇందు | 1.15 |
| వీఎన్ఆర్ | 1.59 | అను బోస్ | 1.05 | బీవీఆర్ఐటీ | 1.47 |
| శ్రేయాస్ | 1.06 | కిట్స్ | 1.46 | జేబీఐటీ | 1.10 |
| ఎంవీఎస్ఆర్ | 1.43 | హితమ్ | 1,05 | బీవీఆర్ఐటీ (మ) | 1.44 |
| విజ్ఞాన్స్ (మ) | | 1.04 | ఎస్ఆర్ | 1.41 | వీబీఐటీ |
| 1.03 | | | | | |
| వర్ధమాన్ | 1.40 | టీకేఆర్ | 1,03 | శ్రీదేవి | 1.37 |
| కేజీ రెడ్డి | 1.03 | శ్రీనిధి | 1.33 | శ్రీదత్త | 1.01 |
| కేఎంఐటీ | 1.29 | లార్డ్స్ | 1,00 | గురునానక్ (టె) | 1.29 |

గేట్ ఇన్‌స్టిట్యూట్ మాతృశ్రీ కళాశాలలకి రూ. లక్షగా ఫీజును నిర్ణయించారు.
(మ) మహిళలు, (టె) టెక్నికల్

# పంచడానికి భూముల్లేవు..

>> మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. నాడు అసెంబ్లీలో వర్గీకరణ కోసం గళమెత్తితే,అప్పటి పాలకులు నన్ను, సంపత్‌కుమార్, సండ్ర వెంకటవీరయ్యను సభ నుంచి బయటకు గెంటేశారు అని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్ని సమస్యలకు వర్గీకరణ పరిష్కారం కాకపోవచ్చు, మీ సమస్యలు పరిష్కరించేటప్పుడు అడ్డుకునేవారిని మీరే నిలువరించాలి, బాధ్యతతో వ్యవహరిస్తే మీ జాతికి న్యాయం జరుగుతుంది అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని, పాలనకు కళ్లు,చెవులు వారేనని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే అది ఉద్యోగుల చేతుల్లోనే ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు,రేషన్‌కార్డుల కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారని, వాటిని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ఉద్యోగులపైనే ఉందని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. రాష్ట్రంలో నెలకు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని, ప్రతి ఉద్యోగికి రూ.కోటీ చొప్పున నెలకు రూ.1000 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని, అయినా సమన్వయం చేసుకుని ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని సిఎం స్పష్టం చేశారు. చదువు ఒక్కటే ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి, విద్య కోసం ప్రణాళికలు రచిస్తున్నాం,న, మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు.కానీ చెప్పులు కుట్టే జాతి ప్రజలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎన్ లు, ఐపిఎన్ లు కావాలని చెప్పారు.రాబోయే 99 రోజులు ఒక దీక్షలా పనిచేస్తే ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని,ఒక్కరోజు పని చేయకున్నా సామాన్యులు ఇబ్బంది పడతారని సూచించారు. ముందుండి నేను సమస్యలను పరిష్కరిస్తాను. వెనుక నుండి జరిగే రాజకీయ దాడులను మీరు చూసుకోవాలని ఉద్యోగ వర్గాలకు సిఎం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పలువురు మాదిగ ఎంపీలు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని మాదిగ సామాజిక వర్గ అభివృద్ధికి తమ మద్దతును ప్రకటించారు.

## మూసీ చుట్టూ 'నైట్ టూరిజం'

>> జిజితీరుపై విమర్శలు చేశారు.నగరాన్ని మంచిగా చేసుకోవడానికి మన ప్రజా ప్రతినిధులను విదేశాలకు పంపామని చెప్పారు. విమానాశ్రయం కట్టే సమయంలో కొంత వ్యతిరేకత వచ్చింది..కానీ ఇప్పుడు పెద్ద ఆస్తి గా మారింది..మూసి మురికిలో బతకాలని ఎవరు అనుకోరు అని చెప్పారు. శంషాబాద్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారబోతుంది ..బెంగళూరు, అమరావతి,చెన్నై కి ఇక్కడి నుంచే బుల్లెట్ ట్రైన్ సౌకర్యం రాబోతుందని చెప్పారు.కొత్త ప్రాజెక్ట్ లు వచ్చినప్పుడు కొందరికి ఇబ్బంది ఉంటుంది. .వాళ్ళను అనాథలను చేయం..భూమి,ఇల్లు కోల్పోతున్న వారిని ఆదుకుంటాం.. నిర్వాసితు లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని చెప్పారు. ప్రపంచం లోనే గొప్ప నగరంగా హైదరాబాద్‌ను తీర్చి దిద్దుతాం..ట్రంప్,ఎలాన్ మాస్క్ లాంటి వాళ్ల సంస్థలు ఇక్కడికి రాబోతున్నాయని, ప్రపంచంతో పోటీపడేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.గొప్పగా అభివృద్ధి చేస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారు..అక్క చాలా కాలం మంత్రిగా పనిచేసింది..ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే వాళ్ళను వీళ్లను తీసుకొచ్చి విమర్శి స్తుంది.. అక్క కుటుంబానికి 40 సంవత్సరాలు అండగా ఉన్న ప్రాంతం అభివృద్ధి జరుగుతుంటే అడ్డుకుంటున్నదని పరోక్షంగా సబితా ఇంద్రా రెడ్డిని విమర్శించారు. ఏం చేసినా కేటిఆర్ అడ్డు పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మూసి రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తాం.. మూసి పక్కన నైట్ ఎకనామిని ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తాం.. ఆయా నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలను ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేశాం.. సన్న బియ్యం ఇస్తున్నాం ఇందిరమ్మ చీరల్లో ఆడ బిడ్డలు పాలపిట్టల్లా మెరిసిపోతున్నారు అని చెప్పారు. గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలను పిట్టలు కొట్టడానికి వాడారు.. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావు లేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తామన్నారు.



## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

హైదరాబాద్, మార్చి6 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది: తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రబెల్లి స్వర్ణకు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్‌గా సేవలు అందించారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా గతంలో బాధ్యతలు నిర్వర్తించారు.

# ఇరాన్ లొంగిపోవలసిందే

>> బేషరతుగా లొంగిపోతేనే యుద్ధానికి ముగింపు ఉంటుందని ట్రంప్ బాహాటంగానే చెపుతుండటంతో మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై యుద్ధంమరింత తీవ్రం అవుతుందన్న అంచనాలున్నాయి. మరోపక్క దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. గత అర్ధరాత్రినుంచి లెబనాన్‌నుంచే హెజ్బొల్లా 70 రాకెట్లనుప్రయోగించిందని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. అలాగే లెబనాన్‌లోని 500 లక్ష్యాలను ఇజ్రాయెల్ ధ్వంసంచేసిందని, 70మందికిపైగా హెజ్బొల్లా మిలిటెంట్లను అంతంచేసినట్లు ప్రకటించుకుంది. అయితే లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ మాత్రం ఇప్పటివరకూ 217 మంది చనిపోయినట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే అమెరికా నిఘా సమాచారంతో ఇరాన్‌లోని భూగర్భంలో ఉన్న అణుస్థావరాలను ధ్వంసంచేసేందుకు ఇజ్రాయెల్ లెక్కకుమించిన బాంబులు జారవిడిచింది. అయితే అప్పటికే కొన్నింటిని బదలాయించారన్న సమాచారం ఉంది. ఇదిలా ఉంటే ఇజ్రాయెల్ విడుదలచేసిన ఖమైనీని మట్టుపెట్టేందుకు ఉపయోగించిన క్షిపణుల వివరాలనుప్రకటిం చింది. బ్లూస్పారో మంచి ఫలితాలిచ్చిందని చెపుతున్నారు. ఇదిలా ఉంటే తమపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అమెరికా మిత్రదేశాలుగా ఉన్న గల్ఫ్ దేశాలపై దాడులు ఉధృతంచేసింది. బహ్రెయిన్, సౌది అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్ వంటి దేశాల్ల అమెరికా సైనిక, వైమానిక దాడులే లక్ష్యం డ్రోన్లు పంపిస్తోంది. అలాగే ఎయిర్‌పోర్టులు, పౌర ఆవాసాలపైనా దాడులు జరిగాయి. ఇదిలా ఉంటే మధ్యప్రాచ్యంలో మోహరించిన తమ సేనలను వెనక్కి రప్పిస్తున్నట్లు జర్మనీ ప్రకటించింది. ఇరాక్, జోర్డాన్‌లలో సుమారు 500 మందికిపైగా జర్మనీ సైనికులను మోహరించింది. అలాగే అమెరికా తయారీ ఎంక్యూ-9 రీపర్‌డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్‌ప్రకటించింది. ఇపుడు అతిపెద్ద చమురు రిఫైనరీలే లక్ష్యంగా ఇరాన్ తన క్షిపణులు, డ్రోన్ల దాడులను ముమ్మరంచేసింది.

ఇరాన్‌కు రష్యా నిఘా సమాచారం..ట్రంప్ ధ్వజం

రష్యా వేగులు ఇస్తున్న నిఘా సమాచారంతోనే ఇరాన్ తమ స్థావరాలపై దాడులుచేస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. అయినా తమసైనికులు ప్రతిఘటిస్తారని, ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ వ్యవస్థ అమెరికాకు ఉందన్నారు. ఇప్పటికే ఇరాన్ రక్షణ వ్యవస్థను నాశనంచేసామని, బేషరతుగా ఇరాన్ లొంగిరావడమే ఆ పాలకులకు మేలుచేస్తుందని హెచ్చరించారు. ఇప్పటికయినా ఇరాన్‌ప్రజలు తెలుసుకోవాలని, మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్ అంటూ మిగా నినాదంతో ట్రంప్ ఇరాన్‌ప్రజలకు పిలుపునిచ్చారు. ఇరాన్ భవిష్యత్తు రూపుదిద్దడంలో తన పాత్ర కీలకమని, ఇరాన్ సుప్రీం లీడర్ ఎంపిక కూడా తన కనుసన్నల్లోనే జరగాలని ఆయన హుకుం జారీచేసారు. అయితే ఇరాన్‌యుద్ధంలో రష్యా,చైనాపాత్రపై తనకు ఎలాంటి సమాచారం లేదని రక్షణమంత్రి పీటర్ హెగ్సేత్‌ప్రకటించడం గమనార్హం.

**ఇజ్రాయెల్‌అణుకేంద్రంపై ఇరాన్‌దాడి**

ఇదిలా ఉంటే ఇజ్రాయెల్‌కు గుండెకాయలా ఉన్న అణుస్థావరంపై దాడిచేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఫ్రాన్స్‌సాయంతో నిర్మించిన అణుకేంద్రంపై ఇరాన్ గురిపెట్టింది. నెగెవ్ ఎడారిలో నిర్మించిన అణుస్థావరంపై ఇరాన్ దాడులకు గురిపెట్టింది. ఇక్కడి అణురియాక్టర్‌కు ఉత్తరదిక్కులో 85 కిలోమీటర్ల దూరంలోనే జెరూసలెం నగరం ఉంది. 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్టుసరిహద్దులు, 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన దేశాలున్నాయి. దాడి అంటూ రిగితే అక్కడినుంచి లీకయ్యే రేడియేషన్ ముప్పు ఈదేశాలకు తప్పదు.

## మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు

>> రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది విద్యార్థులు కాగా.. 10,512 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారు. ఎస్ఎస్‌సి పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 1582 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా.. 1094 స్కూల్స్ ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 4.70 లక్షల మంది ఉండగా.. తెలుగు మీడియం వారు 44,881 మంది ఉన్నారు. 3720 మంది ఉర్దూ మీడియం విద్యార్థులున్నారు. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండేలాగా 040-23230942 నంబర్ అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ తెలిపారు. పరీక్షలకు నమోదు చేసుకున్న విద్యార్థుల్లో 5,17,727 రెగ్యులర్ విద్యార్థులున్నారు. వారిలో బాలురు 260916 మంది బాలికలు 256811 మంది ఉన్నారు. 10,512 ఒకసారి విఫలమైనవారు కాగా.. వారిలో బాలురు 7038 మంది బాలికలు 3474 మంది. మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా.. వారిలో బాలురు 267954 మంది, బాలికలు 260285 మంది ఉన్నారు.

## ఉష్ణోగ్రతలు పైపైకి

>> కేంద్రం హెచ్చరించింది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇళ్ల నుంచి బయటికి వెళ్లే వారు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా తగినంత నీరు తాగాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లిన సమయంలో ఎక్కువ సేపు ఎండలో ఉండకుండా చూసుకోవాలన్నారు.

**వారం - వర్జ్యం**

07-03-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
చవితి రా.7.20
చిత్త ఉ.11.17
వర్జ్యం : సా.5.25-7.10
దు.ఉ.6.23-7.59
రాహుకాలం - ఉ.9.00-10.30

**వార్తాఫలం**

**మేషం :** మీ యొక్క నిర్మాణాత్మకమైన కృషికి ప్రోత్సాహం లభిస్తుంది. సంతాన విషయ వ్యవహారాలలో మీ దృష్టిని కేంద్రీకరిస్తారు.

**వృషభం :** గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండటం మంచిదని భావిస్తారు. వృత్తిలో అనుకూలమైన మార్పులు వుంటాయి.

**మిథునం:** చట్టవరమైన సమస్యలను ఎదుర్కొవడానికి న్యాయవాదులను ఆశ్రయిస్తారు. ప్రయాణాలలో మెళకువలు పాటించండి.

**కర్కాటకం:** బ్యాంకింగ్ వ్యవహారాలలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచవలసి వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:** మీ ప్రమేయం లేకుండానే మిమ్మల్ని వివాదాలలోనికి లాగబడే అవకాశాలున్నాయి. జీవిత భాగస్వామి నుండి సాయం అందుతుంది.

**కన్య :** ఒదిగి వుంటేనే ప్రయోజనాలు చేతికి అందుతాయని అనుభవపూర్వకంగా మీరు తెలుసుకుంటారు. వాహన సౌఖ్యం కలదు.

**తుల :** టెండర్స్ అతి కష్టం మీద అనుకూలిస్తాయి. వృత్తి పరంగా ఓర్పు వహించవలసి ఉంటుంది. శుభవార్తలు.

**వృశ్చికం:** గత అనుభవాలను గుర్తుంచుకొని స్వయంకృతాపరాధాలు దొర్లకుండా జాగ్రత్తగానే మెలగగలుగుతారు.

**ధనుస్సు:** అవిశ్రాంతంగా శ్రమించవలసి వస్తుంది. బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. ధనలాభం.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**కుంభం:** గణితంలోని సాంకేతికమైన లోపాలను గుర్తించి జాగ్రత్తలను తీసుకుంటారు. తద్వారా లాభపడుతారు.

**మీనం :** కాగలకార్యం గంధర్వులు నిర్వహించారనే రీతిగా అప్రయత్న కార్యసిద్ధి ఒక సందర్భంలో లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సేద్యంలో సాంకేతిక విప్లవం

>> చాల్సిన అవస రం ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. 2026-27 బడ్జెట్‌లో జీడిపప్పు, కోకో, శ్రీగంధం లాంటి అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించనట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. వంట నూనెలు, పప్పు ధాన్యాలపై ఒక జాతీయ మిషన్, అలాగే ప్రకృతి వ్యవసాయంపై మరో జాతీయ మిషన్ ఏర్పాటు వంటివి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నా రు. వ్యవసాయంలో సాంకేతిక ప్రాముఖ్యతను వివరిస్తూ, కిసాన్ ఐడి ద్వారా ఇప్పటి వరకు 9 కోట్ల మంది రైతులను డిజిటల్ నెట్‌వర్క్‌లో చేర్చామని తెలిపారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా దాదాపు 10 కోట్ల మంది రైతులు రూ.4 లక్షల కోట్ల ఎక్కువ మొత్తాన్ని పొందారని మోడీ తెలిపారు. 'పిఎం ఫసల్ బీమా యోజన' ద్వారా దాదాపు రూ.2 లక్షల కోట్లకు పైగా బీమా క్లెయిమ్స్ పరిష్కారమయ్యాని చెప్పారు. 75 శాతానికి పైగా సంస్థాగత రుణాల విస్తృతి పెరిగిందని నరేంద్ర మోడీ వెల్లడించారు. 'ఇలాంటి అనేక ప్రయత్నాలు రైతులకు నష్ట భయాలను తగ్గించి, కనీస ఆర్థిక భద్రతను కల్పించాయి' అని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. దాదాపు 30 కోట్ల భూముల డిజిటల్ సర్వే పూర్తయిందని, భారత్ విస్తార్ వంటి ఎఐ ఆధారిత ప్లాట్‌ఫారమ్‌లు పరిశోధనా సంస్థలకు, రైతులకు మధ్య వారధిగా మారుతున్నాయని చెప్పారు. అలాగే, గ్రామీణ మహిళల సాధికారత కోసం చేపట్టిన లఖ్‌పతి దీదీ అభియాన్ విజయవంతమైనదని, 2029నాటికి మరో 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా మార్చడమే లక్ష్యమని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేశారు. మత్స్య రంగానికి సంబంధించి, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చేపల ఉత్పత్తిదా రు భారత్ అని ప్రధానమంత్రి తెలిపారు. వివిధ జలాశయాలు, చెరువుల ద్వారా మనదేశంలో ప్రస్తుతం సుమారు 4.5 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతుండగా, అదనంగా మరో 20 లక్షల టన్నుల ఉత్పత్తికి అవకాశముందని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. 'ఎగుమతుల వృద్ధికి ప్రధాన వేదికగా మత్స్య రంగం మారగలదు' అని నరేంద్ర మోడీ అన్నారు. నీలి ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవటానికి చేప పిల్లలను పెంచే కేంద్రాలు, వాటికి ఆహారం, రవాణా రంగాల్లో సరికొత్త వాణిజ్య నమూనాల అవసరముందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మత్స్య శాఖ, స్థానిక వర్గాల మధ్య బలమైన సమన్వయం ఉండాలని ప్రోత్సహించారు. "గ్రామీణ సుసం పన్నతకు అత్యధిక విలువ, అత్యంత ప్రభావం చూపే రంగంగా ఇది మారగలదు. మీరంతా దీని పై చర్చించాలి" అని మోడీ స్పష్టం చేశారు. నేడు భారత్ ప్రపంచంలో అతిపెద్ద పాల ఉత్పత్తిదారు గానూ, గుడ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలోనూ ఉందని ప్రధానమంత్రి చెప్పారు. మేలుజాతి పశుసంతతిని పెంపొందించడం, రోగ నిరోధకత, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహణపై దృష్టి సారి స్తూ.. దీన్ని మరింత ముందుకు తీసుకుపోవాల న్నారు. పిఎం ఆవాస్ యోజన, పిఎం గ్రామ సడక్ యోజన వంటి పథకాల ద్వారా గ్రామీణ సుసంపన్నతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై స్వ యం సహాయక బృందాల ప్రభావాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "గ్రామీణ ప్రాంతాల ను సుసంపన్నం చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని మోడీ స్పష్టం చేశారు. గ్రామీణ వ్యవస్థలో విప్ల వాత్మక మార్పులు లక్ష్యంగా ఈ కీలక రంగాల్లో పెట్టుబడులను పెంచాలని పారిశ్రామికవేత్తలను ఆయన కోరారు.

# సివిల్స్‌లో 958 మంది ఎంపిక

>> ఎయిమ్స్ నుంచి 2023లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. తొలి ప్రయత్నంలోనే 2024 సివిల్స్‌కు ఎంపిక కాగా ఢిల్లీ, కేంద్ర పాలిత ప్రాంత అడ్మినిస్ట్రేషన్‌లో గ్రూప్ బి ఆఫీసర్‌గా చేరారు. 2025లో రెండో ప్రయత్నంలో మాత్రం మొదటి ర్యాంకుతో ఐఏఎస్ సాధించాలనే తన కలను నెరవేర్చుకున్నాడు. 958 మందిని యుపిఎస్‌సి ఎంపిక చేయగా.. వారిలో జనరల్ 317 మంది, ఈడబ్ల్యూఎస్ 104 మంది, ఓబీసీ 306 మంది, ఎస్సీ 158 మంది, ఎస్టీ 73 మంది ఉన్నారు. మొత్తం 1087 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసినప్పటికీ... 129 పోస్టులకు అర్హులైనవారు లేకపోవడంతో ఫలితాలను ప్రకటించలేదు. యుపిఎస్‌సి ప్రకటించిన నోటిఫికేషన్‌లో ఐఏఎస్ 180, ఐఎఫ్ఎస్ 55, ఐపీఎస్ 150, గ్రూప్‌ఏ (సెంట్రల్ సర్వీసెస్) 507, గ్రూప్‌బి సర్వీసెస్ 195 ఖాళీలు ఉన్నట్టు నోటిఫికేషన్‌లో ప్రకటించింది. గతేడాది మే 22న ప్రిలిమ్స్ నిర్వహించిన యుపిఎస్‌సి.. అందులో అర్హత సాధించిన వారికి ఆగస్టు 22 నుంచి 31 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తాచాటిన వారికి గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ఇంటర్వ్యూలను పూర్తి చేసింది. ఇంటర్వ్యూలు పూర్తయిన వారం రోజుల్లోనే యుపిఎస్‌సి తుది ఫలితాలను ప్రకటించింది. సివిల్స్ ఫలితాల్లో పలువురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో గూడెల్ల సృజన 55వ ర్యాంక్ సాధించగా.... డీఎస్‌కే ప్రచేత్ 193వ ర్యాంకు, ఎస్ వర్షిత్ రెడ్డి 259, ఎం.పవన్‌కుమార్ రెడ్డి 297, వెలిమినేటి విక్రమసింహారెడ్డి 541, గుమ్మల శ్వేత 573, పల్లి ప్రమోద్ విష్ణు 640, గుమ్మల విజయసింహారెడ్డి 682, పోతుపురెడ్డి భార్గవ్ 738, పుదారి రాహుల్ 748, కుమ్మరి శ్రవణ్‌కుమార్ 768, అనిరుధ్ కత్తిమాని 786, కోరపోతుల శ్రీకర్‌రాజు 806, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823, కట్టా ప్రత్యూష 908, గోగుల రాజశేఖర్ 920, గుగులోతు జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో ప్రతిభ చాటారు.

# స్నేహితుని వివాహానికి వెలుతూ మృత్యుఒడిలోకి

## ఇద్దరు యువకుల దుర్మరణం - చాకుంటా ఎక్స్ రోడ్డులో రోడ్డు ప్రమాదం

**చొప్పదండి ప్రభాతవార్త:** ఇద్దరు ప్రాణ స్నేహితులు కలిసి వారి స్నేహితుని వివాహానికి వెళుతుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం సంభవించి ఇద్దరు ప్రాణ స్నేహితులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మనుషులను కలిసి వేస్తుంది ఈ మేరకు కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చాకుంట ఎక్స్ రోడ్డు వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో తల నుజ్జు నుజ్జు ఐ మృతి చెందారు ఈ మేరకు రుక్మాపూర్ గ్రామానికి చెందిన చిలుక రాజేశం కుమారుడు చిలుక ప్రదీప్ కుమార్ (24) తాటికొండ ఓ దయ కుమారుడు సాయికిరణ్ (24) లు ఇద్దరు ప్రాణ స్నేహితులు చొప్పదండి మండల పరిధిలోని చాకుంట గ్రామంలోని తన స్నేహితుని వివాహానికి వీరు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనం టిఎస్ 08 ఎఫ్ ఎఫ్ 6269 గల దానిపై చాకుంట చాకుంట గ్రామానికి రుక్మాపూర్ నుండి బయలుదేరారు కరీంనగర్ నుండి ధర్మారం వైపు వెళ్తున్న టిప్పర్ నంబర్ టీఎస్ 15 యు ఏ 1818 గల వాహనం వేగంగా వచ్చి ద్విచక్ర వాహనానికి వెనుక వైపు నుండి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు కింద పడిపోయారు అదే సమయంలో వారి తలలపై నుండి లారీ పోవడంతో ఆ ఇద్దరి స్నేహితుల తలలు నుజ్జు నుజ్జు కావడంతో ఆ ప్రాణ స్నేహితులు ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు స్నేహితుని వివాహానికి వెళుతూ ఇద్దరు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలలో విషాదఛాయలు నెలకొన్నాయి మృతి చెందిన సంఘటన వద్ద మృతుల బంధువులు చేసిన ఆర్తనాదాలు పలువురిని కంతతడి పెట్టించాయి బంగారు భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు కంటతడి పెట్టారు సంఘటన స్థలానికి ఎస్సై నరేష్ రెడ్డి చేరుకొని మృతులను పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మృతుడు చిలుక ప్రదీప్ కుమార్ తండ్రి చిలుక రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు ఈ సంఘటన జరగడంతో రుక్మాపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి టిప్పర్ డ్రైవర్ ధర్మారం మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన సాయవేణి ప్రవీణ్ గా గుర్తించినట్లు ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు. సంతాపం తెలిపిన ఎమ్మెల్యేరుక్మాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చిలుక ప్రదీప్ కుమార్ తాటికొండ సాయి కిరణ్ లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం సంతాపాన్ని తెలిపి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు ఈ రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని మంచి భవిష్యత్తు ఉన్న యువకులు మరణం చెందడం కలిసి వేస్తుందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# అర్హులందరికి సంక్షేమ పథకాలు అందాలి

## - ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి
## - సన్నాహక సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా చూడాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొండ సురేఖతో కలసి మాట్లాడుతూ ఈ నెల 6నుండి జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు సమన్వయంతో పనిచేసి విజయ వంతం చేయాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్క రించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్ధవంతంగా వినియోగంలోకి తేవాలన్నారు. పాఠశాలల వహనాలు ఫిట్‌నెస్ లేనియెడల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను అమలుపరుచే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నెల 12న సర్పంచ్‌లు, మున్సి పల్ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, చైర్మన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించి విధులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పించా లన్నారు. కార్యక్రమ అమలు పర్య వేక్షణకు ప్రత్యేక అధికారులను నియ మించాలని సూచించారు. వేసవిలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, మరామత్తు పనులు అంచనాలు ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషిచేయాలని, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పూర్తిగా కార్యక్రమ అమలులో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపి పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, మహబూ బాబాద్ కలెక్టర్ స్నేహశబరీష్, కలెక్టర్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# చెన్నూరు మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

## మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**చెన్నూరు, మార్చి 6, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మంత్రి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, కౌన్సిలర్లు ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరో రెండు ప్రాణాలు బలి

## హాసన్ పర్తి మండల కేంద్రం నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్ వరకు మధ్యంతరంగా నిలిపివేసిన డివైడర్ పనులు

**హసన్ పర్తి, మార్చి 6, ప్రభాతవార్త:** హసన్ పత్తి మండల కేంద్రం నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్ వరకు నిత్యం జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా ఏర్పాటు చేయాల్సి న డివైడర్ పనులను మధ్యంతరంగా నిలిపివేయడంతో అనేకమంది రోడ్డు ప్రమాదాలకు గురి అవుతూ తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఇట్టి విషయాలను ఫిబ్రవరి 25 రోజున వార్త దినపత్రికలో ప్రాణాలు పోయినా పట్టించుకోరా కథనాన్ని ప్రచురించినప్పటికీ అధికారులు నిద్రమత్తులో ఉండడంతో నేడు ఎంతో భవిష్యత్తు ఉన్న ఎస్సార్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తమ ప్రాణాలను కోల్పోయిన సంఘటన డివిజన్ ప్రజలను కలచివేస్తుంది. సీతంపేట క్రాస్ నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్ వరకు ప్రమాదాలు జరుగు జోన్ గా అధికారులు గుర్తించి, ప్రమాదాలను నివారించుటకు రోడ్డు మధ్యలో సిమెంటు దిమ్మలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి చేసే అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదంటూ ఫిబ్రవరి 25వ తేదీన వార్తా దినపత్రిక ప్రాణాలు పోయినా పట్టించుకోరా అనే కథనాన్ని ప్రచురించినప్పటికీ నిద్రమత్తులో ఉన్న అధికారులు, ప్రజల ప్రాణాలకు విలువ కట్టని ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వలన నేడు ఎంతో భవిష్యత్తు ఉన్న మరో రెండు నిండు ప్రాణాలు ఈ రోడ్డుపై తమ ప్రాణాలను బలి చేసుకున్నారు. హసన్ పర్తి మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులో గల ఎస్ ఆర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న సుప్రతిక (21), జు వైల్ అక్రమ్(23) అనే విద్యార్థులు శుక్రవారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట సమీపంలో మొరం టిప్పర్ హసన్ పత్తి మండల కేంద్రం నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్ వరకు నిత్యం జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా ఏర్పాటు చేయాల్సి న డివైడర్ పనులను మధ్యంతరంగా నిలిపివేయడంతో పల్సర్ బండి ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. సుప్రతిక, అక్రమ్‌లు పరీక్ష పూర్తి చేసుకొని కళాశాల నుంచి హనుమకొండ వైపుకు వస్తున్న క్రమంలో ఎలుకతోర్తి నుంచి హనుమకొండ వైపుకు వస్తున్న టిప్పర్ పెద్ద చెరువు కట్ట సమీపంలో నీ పెట్రోల్ పంపు వద్ద ఢీకొట్టడంతో సుప్రతిక, అక్రమ్ లు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ చేరాలు తెలిపారు. ముందే హెచ్చరించిన వార్త దినపత్రిసీతంపేట క్రాస్ నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్ వరకు రోడ్డు ప్రమాదంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారని విషయాన్ని గుర్తు చేస్తూ స్థానిక కార్పొరేటర్ గాని, వర్ధన్నపేట ఎమ్మెల్యే గాని, మున్సిపల్ అధికారులు గాని, జిల్లా కలెక్టర్ గాని స్పందించిన దాఖలాలు లేకపోవడంతో యువ ఇంజనీర్ల ప్రాణాలను కోల్పోవడం అధికారుల నిర్లక్ష్యంగా ఉంటుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

# అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడిన వారిపై హత్యకేసులు నమోదు చేయాలి : విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**విజయవాడ, మార్చి 6, ప్రభాతవార్త :** గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమ క్వారీయింగ్ పాల్పడి అమాయకుల ప్రాణాలు బలికొంటున్న అక్రమార్కులపై హత్యకేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సియంకు విజ్ఞప్తి చేసారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన అసెంబ్లీలోని మీడియాపాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలో హోలీపండుగరోజు ఆనందంగా హోలీపండుగ జరుపుకున్న ముగ్గురు విద్యార్దులు చేతులు కడుగుకునేందుకు సుందరయ్యచెరువులో దిగి మృత్యువాత పడిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేసారు. సుందరయ్యచెరువులో గత ప్రభుత్వ హయాంలో భారీస్థాయిలో గోతులు తవ్వి మట్టిని అక్రమంగా విజయవాడ, గుంటూరులోని వెంచర్లకు విక్రయించారని, ఈగోతుల కారణంగా అభం శుభం తెలియని అమాయకులు క్వారీగోతుల్లో పడి మరణించటం బాధాకరమన్నారు. ఆనాడు చేసిన అక్రమ క్వారీయింగ్ వల్లే అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, ఈదురాగతానికి పాల్పడిన వారిపై హత్యకేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే వెంకట్రావ్ సంబందిత మంత్రిని కోరారు. మృతుల కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హాయాంలో గన్నవరం నియోకవర్గంలోని చెరువులు, కొండలు, కొండగట్లు, పోలవరంకాలువ గట్లు అక్రమంగా తవ్వేసి వేలాది లారీల మట్టి గ్రావెల్‌ను దోచేసారని ఆరోపించారు. గుడివాడ, గన్నవరం, పామర్రు మాజీ ఎమ్మెల్యేలు అక్రమ క్వారీయింగ్ ద్వారా కోట్లాదిరూపాయల ప్రజాదనం దోపిడి చేసారని ఆరోపించారు. వీరు చేసిన అక్రమ క్వారీయింగ్ వల్ల గన్నవరం నియోజకవర్గంలో చెరువుల్లో గోతుల్లో పడి గడచిన నాలుగేళ్ళ కాలంలో సుమారు 34 మంది మృతి చెందారని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలో ప్రాణనష్టం నివారణకు ప్రమాదకరంగా మారిన 84 చెరువులకు ఫెన్సింగ్ నిర్మించి ప్రజల ప్రాణా లకు భద్రత కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.



అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న యార్లగడ్డ

# త్వరలో రాజకీయ పార్టీ ఏర్పాటు



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రజల పక్షాన నిలబడేందుకు ,తెలంగాణ ఇంటి పార్టీగా పని చేయడానికి రానున్న రోజుల్లో రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. అందుకు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు,కరుణాకటాక్షాలు దయ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తాను నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనోవేదన శ్రీవారి దయతో తీరి పోయిందని, సత్యం, న్యాయం, ధర్మం మావైపు ఉందని నేను తొలి నుండి చెప్పడం జరిగిందన్నారు. ఈ స్వామి దయతో పూర్తిస్థాయిలో తాను నిర్దోషిగా తేలడం వెల్లడైందన్నారు. దీనివల్లే తాను కాలినడకన తిరుమలకు వచ్చి వేంకటేశ్వరస్వామికి మొక్కు చెల్లించుకున్నానని కవిత తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలంతా కలసి ఉండాలని, బాగుండాలని ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని కోరుకున్నానన్నారు. జై తెలంగాణ,జై ఆంధ్ర అంటూ మరోసారి జాగృతి అధ్యక్షురాలు కవిత తన వాణిని తిరుమలలో వినిపించారు. తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కా రంలో, ప్రతి పక్ష పాత్ర పోషించడంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు విఫల మయ్యాయని ఆమె విమర్శించారు. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను, తన కుటుంబం మాన సిక వేదన అనుభవించా వ ం ని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేసిన న్యాయ వ్య వ స్థ కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం వేకువజామున ఆమె భర్త అనిల్‌తో కలిసి ఆలయం లోనికి చేరు కున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆనంద నిలయంలో శ్రీవారి అభిషేక సేవ లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పిం చారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల కవితతో అభిమానులు, భక్తులు ఫోటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కవిత ముందుకు కదిలారు.

సత్యం, న్యాయం, ధర్మం మావైపు ఉంది
శ్రీవారికి మొక్కులు తీర్చుకున్న జాగృతి నేత కవిత

# తిరుపతిలో 30వేలు 'ఉద్యమి' సభ్యత్వం లక్ష్యం

## - జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్



**తిరుపతి, మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం,స్మార్ట్‌సిటీ తిరుపతినగరంలో జనసేన పార్టీ "ఉద్యమి" క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుపెట్టామని తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. ఈ ఏడాది 30వేల సభ్యత్వాలు నిర్దేశంగా తీసుకుని నమోదు చేయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత ఏడాది 16వేల సభ్యత్వాలు చేశామన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతినగరంలో ఆర్‌సిరోడ్డు ప్రాంతంలో పళని థియేటర్ సమీపంలో జనసేన పార్టీ "ఉద్యమి" క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. తిరుపతి నగరంలో నాలుగు కేంద్రాల్లో చురుగ్గా సాగుతున్న ఈసభ్యత్వ నమోదు ప్రక్రియలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి పలు రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు.జనసేన క్రియాశీలక సభ్యులకు ప్రమాదం జరిగితే వైద్యంకోసం ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 50 వేలరూపాయలు నుండి 2లక్షల రూపాయల వరకు జనసేన సాయం అందిస్తుందన్నారు. దురదృష్టవశాత్తు సభ్యుడు మరణిస్తే ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారన్నారు. దేశంలో మరే రాజకీయ పార్టీ చేయని విధంగా వేలాది మంది కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్న జనసేన పార్టీకి సభ్యులు,కార్యకర్తలే బలమన్నారు.లక్షలాది రూపాయల సాయం కార్యకర్తలకు అందించిన చరిత్ర జనసేనకు ఉందన్నారు..మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా చేయూతనందించిన దాఖలాలు వైసిపికి ఉందా అని కిరణ్ ప్రశ్నించారు. జనసేనలో సభ్యులకు కూడా జనసేనాని కుటుంబంలా భావిస్తారన్నారు.

# నేడు ఢిల్లీ సదస్సుకు సిఎం చంద్రబాబు

## సాంకేతికత, సుపరిపాలనపై ముఖ్యమంత్రి ప్రసంగం

**విజయవాడ,మార్చి 6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు రేపు ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మద్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్ లో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సు లాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు.

రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు.

# లడ్డూపై వైసిపి వితండవాదం

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల లడ్డూ కల్తీ విషయంలో తప్పు ఒప్పుకోకుండా వైకాపా నాయకులు వితండవాదం చేయడం శోచనీయమని భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. విజయవాడలో గురువారం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవినీతి, అరాచక పాలనకు ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. వైకాపా హయాంలో అనేక ఆలయాలపై దాడులు జరిగాయని, రథాలు దగ్ధం అయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు హైస్పీడ్ రైల్ కారిడార్‌తో జవసత్వాలు వస్తాయని వివరించారు.

దక్షిణాధిలో భాజపా అనూహ్య విజయాలు సాధిస్తుం దన్నారు. దేశంలో త్వరలో జమిలి ఎన్నికలు తథ్యమని, ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలన, కాంగ్రెస్ అవినీతిపై ప్రజలు విసిగిపోయారని, రానున్న రోజుల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# గుంటూరులో తొలిసారిగా జాతీయస్థాయి 'శక్తిమహోత్సవ్'

**సచివాలయం,మార్చి 6,ప్రభాతవార్త:** గుంటూరులో తొలిసారిగా జాతీయస్థాయి శక్తి మహోత్సవ్- మహిళా శక్తి మరియు కళల మహోత్సవం. దక్షిణమద్యరైల్వే గుంటూరు డివిజన్, నాగ్ పూర్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ మరియు భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖలతో కలసి తొలిసారిగా శక్తిమహోత్సవ్ అనే జాతీయస్థాయి సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. రంగోలి,ఫైర్‌లెస్ కుకింగ్ పోటీలు నిర్వహించి మహిళా ఉద్యోగుల ప్రతిభను ప్రోత్స హిస్తున్నారు.

# కల్తీనెయ్యి అక్రమాలపై నిశితంగా అధ్యయనం

## - ఏకసభ్యకమిటీ దర్యాప్తు షురూ!



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన సూత్ర దారుల వ్యవహారం తేల్చేందుకు నియా మకమైన ఏకసభ్యకమిటీ నిశితంగా అధ్య యనం మొదలుపెట్టింది. ఈ కమిటీలో విశ్రాంత ఐఎఎస్ అధికారి, సిఎస్ దినేశ్ కుమార్‌కు సహాయకులుగా ఐదుగురిని నియమించిన విషయం విదితమే. ఈ బృందం 2019నుండి 2024 వరకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన తంతుపై, టిటిడిలో ప్రేక్షకపాత్ర వహించిన అధికారుల పాత్రపై మరింత నిశితంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక పాత్రధారులను అరెస్ట్ చేసిన సిబిఐ సిట్ కటకటాల్లోకి పంపింది. కొందరు బెయిల్‌పై బయట ఉండగా కొందరు షరతులతో ఉన్నారు. ఈ నేపధ్యంలో సూత్రధారులను తేల్చేందుకు ఏకసభ్యకమిటీని ప్రభుత్వం నియమించింది. పలువురిని విచారణకు పిలిచే విషయంపై ,మరిన్ని ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైందనేది సమాచారం. శుక్రవారం కూడా తమ వద్ద ఉన్న ఆధారాలతో భూదేవి కాంప్లెక్స్‌లోని పాత సిట్ కార్యాలయంలో సేకరించిన సమాచారాన్ని, ఇప్పటివరకు అరెస్ట్‌చేసిన నిందితుల నుండి సిట్ రాబట్టిన వివరాలను పరిశీలించి తదుపరి అనుసరించాల్సి న వ్యూహంపై తీవ్రంగా చర్చించారనేది విశ్వసనీయ సమాచారం. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో ఏకసభ్యకమిటీ అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్ధంచేసుకొంటోంది. 2020-24లో అప్పటి టిటిడి బోర్డు లో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. ఇంకా మరింత కీలక సమాచారం సేకరించడానికి టిటిడి అధికారులను, మార్కెటింగ్, కొనుగోలు కమిటీ సభ్యులను మరోసారి పిలిచి వివరాలు రాబట్టేందుకు ముందుకు కదలనుంది. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు అందుకున్నారనే కోణంలో కూడా కల్తీనెయ్యి బాగోతంలో ముందుముందు ఎవరికి నోటీసులు వెళ్తాయో,ఎవరిని విచారణకు పిలిచి చర్యలు తీసుకుంటారనేది అందరిలో ఉత్కంఠే.

# రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం: మంత్రి నారా లోకేశ్

**విజయవాడ మార్చి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎంసీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూ విస్తీర్ణం, ఖాళీగా ఉన్న భూ విస్తీర్ణంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉంది కాబట్టే ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని, ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలకి కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖలో ఏసిప్ అనే సంస్థకు భూములు కేటాయించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

# మాజీ మంత్రి బొత్సకు మళ్లీ అస్వస్థత

**విజయవాడ.మార్చి6,ప్రభాతవార్తప్రతినిధి:** శాసన మండలిలో వైసీపీ పక్షనేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణమరోసారి అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం.

అనివార్యమైన యుద్ధం అంటూ ఏదీలేదు. యుద్ధం వస్తే అది మానవ వివేక వైఫల్యం వల్ల.

-బొనార్‌లా

# ఎండల మంటలు!

ఎండలు మండిపోతున్నాయి. ఎల్‌నినో ప్రభావం ముందస్తుగానే జనానికి తన ప్రతాపం చూపిస్తోంది. మే, జూన్ నెలల్లో ఉంటుందనుకున్న గ్రీష్మతాపం మార్చి 1నే తలుపులు తట్టింది. మొన్న హోలీ తర్వాత నుంచే ఎండలు పెరిగి నిప్పుల కొలిమిని తలపించే వాతావరణాన్ని చూస్తామని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. మే నెల నుంచే సాధారణ ఉష్ణోగ్రతలు కన్నా ఎక్కువగా నమోదవుతాయని విశ్లేషించినట్లుగానే ఎండలు భారీ ఉష్ణోగ్రతలు నమోదు చేస్తున్నాయి. మార్చి నుంచి మే వరకు వడగాల్పులు వీస్తాయని ప్రజల్ని ముందే జాగ్రత్త చేశారు. మార్చి మొదటి వారంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉన్నా ఆ తర్వాత పూర్తిగా మారిపోతాయి. గత పాతికేళ్ల సమాచారాన్ని క్రోడీకరించుకుంటే ఈ ఫిబ్రవరి నెల నాటికి అతి తక్కువ వర్షపాతమే నమోదైంది. మధ్యలో ఓ రోజు తెలుగు రాష్ట్రాలలో అకాల వర్షాలు పడ్డాయి. అవన్నీ రైతుకు హర్షం కలిగించేవి కాదు. వరి, కొన్ని వాణిజ్య, తోట పంటల సాగుపై తీవ్రప్రభావమే చూపింది. పసిఫిక్ మహాసముద్రంలో 'లానినో' పరిస్థితులు రానురాను బలహీనపడ్డాయి. పసిఫిక్ మహా సముద్రంలోని తూర్పు, మధ్య ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కన్నా ఎక్కువగా పెరిగే పరిస్థితే 'ఎల్‌నినో' ఈపరిస్థితుల 'ఎల్‌నినో' రుతుపవనాల మీద తీవ్రమైన ప్రభావం చూపెడుతుంది. గత అనుభవాలతో పోల్చి చూస్తే ఈసారి వర్షపాతం అతి తక్కువగా ఉంది. వ్యవసాయ రంగం దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాధారిత ప్రాంతాల్లో పంటల సాగు గురించే అధికార్లు ఆలోచించి రైతుకు ప్రత్యామ్నాయాలు సూచించాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితులలో అనిశ్చితి తప్పదు. వర్షపాతంలో తగ్గితే ఖరీఫ్‌సాగుపై ప్రతికూల ప్రభావం ఏర్పడ్తుంది. వరి, పత్తి మొక్కజొన్న సాగుపై నీటి కొరత ఏర్పడ్తుంది. అందుచే తక్కువ నీటి వనరుతో ఎక్కువ దిగుబడి వచ్చే రకాలను మాత్రమే నాటుకోవాలి. ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో మార్చి మొదటి వారంలో 37డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సూర్యుడు సెగలు కక్కుతుండడంతో వేసవి తాపాన్ని తట్టుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. దక్షిణ, మధ్య భారతంలోని వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఎండల తీవ్రత, వేడి గాల్పులతోపాటు ఉక్కపోత కారణంగా ప్రజలకు వేసవి కష్టాలు మొదలౌతాయని ఆ ప్రకటనలు తెలియ చేస్తున్నాయి. ఇప్పుడదే జరిగింది.మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సీజన్‌లో వేడిగాలులు అధికంగా ఉండి పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్తులపై ప్రభావాలు చూపిస్తాయి. ప్రధానంగా ప్రజారోగ్యం, విద్యుత్తు, నీటి వనరులరంగం వేసవి ప్రభావాన్ని ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తగ్గించే కృషిచేయాల్సి ఉంది. నీటి వనరుల సమతుల్యత లేక పర్యావరణం దెబ్బతింటుంది. ఇలా ఏర్పడే పరిస్థితులన్నీ గ్రహించుకుం టే వాతావరణానికి పెనుసవాల్ తప్పదు. వ్యవసాయాధారిత ప్రాంతాల్లో ఆహార సమృద్ధిపై కూడా కించిత్ ప్రభా వం ఉంటుంది. ఈ కారణం చేత గోధుమ, వరి, జొన్న, మొక్కజొన్న సాగుఉత్పత్తుల మీద పడుతుంది.వర్షపాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరగడం, తదనంతర పరిణామాలతో వరిసాగు విస్తీర్ణం తగ్గే అవకాశముంది. ఈసారి వేడిమి వ్యవసాయరంగ ఉత్పత్తులపై విపరీత ప్రభావం పడ్తుంది. అధిక ఉష్ణోగ్రతలకు తేమ తోడవడంవలన మానవాళి ఆరోగ్య పరిస్థితులపైప్రతికూల ప్రభావం పడుతుంది. ఇవన్నీ పలు శాస్త్రీయపరిశోధనలు వెల్లడించినవే.తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికల నేపథ్యంలో దాదాపు పొడి వాతావరణం ఏర్పడ్తుంది. ఉత్తర ఒడిశా నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా విదర్భ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీఎత్తులో ద్రోణివిస్తరించి కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, ఉత్తర కోస్తా, రాయలసీమ దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయి. ఒకటి రెండు చోట్ల పొగమంచు కురుస్తుంది. ఈ వేసవి సీజన్‌లో వాతావరణం, కొత్తరకం మిశ్రమ వాతావరణాన్ని తలపిస్తుంది. పొడి ఎండలో చెమట చిందిస్తే గాలిలో ఉన్న తేమతో కలిసి చిటపటలుతయారవుతుంది. శరీరంపై వేడికితమ రాజుకుని చర్మం మండుతుంది. అదే ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరవుతారు.గాలిలో ఉష్ణోగ్రతతోపాటు తేమకూడా అధికంగా ఉంటుంది.ఇంట్లో కూర్చున్నా ఎసి కిందకూర్చున్నా ఇలాంటి అనుభవాన్ని చవిచూడాల్సి వస్తుంది. తీరప్రాంతాల్లో మానవ శరీరంపై తేమ వాతావరణం వలనపొక్కులు ఏర్పడుతాయని డాక్టర్లుచెబుతుంటారు. వాతావరణ వ్యవస్థలు అస్థిరంగా ఉండడం వల్ల సముద్ర పుగాలులు భూభాగంపైకి ఎక్కువ తేమను మోసుకొస్తాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. గతరెండేళ్లుగా మనం విభిన్న వాతావరణంలో సతమతమయ్యాం. పట్టణీకరణ పెరిగిన ఇటీవలకాలంలో భవనాలనుసిమెంటుతో నిర్మిస్తారు. పగటిపూట గ్రహించుకున్న వేడిమివలన రాత్రిళ్లు ఆ భవనాల గోడల్నించి 4నుంచి 5డిగ్రీల వేడిమిని కలుగచేస్తాయి.ఈపరిస్థితుల్లో శరీరంలో వేడిని చల్లపరిచేందుకైనా దాహం వేసినా వేయకపోయినా మంచినీటిని స్వీకరించాలి. తేమఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎ.సి వేసుకున్నా వేడిగాలివస్తుంది.అదికూడా మానవ శరీరానికి మంచిదికాదు.కిటికీలు తెరిచిఉంచుకోవడం, ఎగ్జాస్ట్ ఫాన్లు వాడుకోవడం మంచిది.వృద్ధులు, చంటిపిల్ల లైతే వేసవిలో ఇంటినుండి బయటకు రాకుండా ఉండటం మేలు.

విద్య అనే మహావృక్షం వేళ్లు చేదుగానూ అది అందించే ఫలం మధురంగానూ ఉంటుంది.



డబ్ల్యు.ఎమర్సన్

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి.జాన్సన్

## ప్రజావాక్కు



### జ్యోతిష్కులారా ! మీ జాతకం మీకు తెలియదా?

మార్చి మొదటి వారంలో దుబాయిలో ప్రపంచజ్యోతిష్య మహాసభలున్నాయని ఇండియాలోని జ్యోతిష్య పండితులంతా పంచలు ఎగగొట్టుకొని, సంకలో జ్యోతిష్యభండాగారాన్ని పెట్టుకుని, ముఖాన బూడిదపుసుకొని వెళ్లారట? తీరావెళ్లాక అక్కడయుద్ధం మొదలయింది.దానితో జాతక మహాసభలు కాస్తా ఆగిపోయాయి. ఇంకేముంది తిరుగు ప్రయాణం చేద్దామంటే విమానాలురద్దు. ఇండియాలోని అధికారులకు మొరపెట్టుకుంటున్నారట త్వరగా మాఇళ్లకు చేర్చండి అని!అయినా మీరు మహా జ్యోతిష్యపండితులు కదా!త్రికాలజ్ఞులుకదా.యుద్ధమొస్తుంది, జ్యోతిష్య సభలు ఆగిపోతాయని, వెళ్ళిన జ్యోతిష్కులకు ఒక్కరికి కూడా శాస్త్రాలు చెప్పలేదా?వాస్తు,జ్యోతిష్యం, రంగురాళ్లు మీ జీవితాలను మారుస్తాయనేది భ్రమ.ఇవన్ని పొట్టకూటి రాయుళ్ల బతుకుదెరువుకొరకుఏర్పాటుచేసుకున్న తంతు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

### యుద్ధం వద్దు!

యుద్ధం పేరుతో కొన్ని దేశాల వారు ఐక్య రాజ్యసమితి ఆశయాలు, వాటి నిబంధనలు తుంగలో తొక్కి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది చాలా విచారకరం.ఈ కారణంగా అంతర్జాతీయస్థాయిలోమానవత్వం మంట కలిసిపోయింది. బాంబుల దాడులు, భీకార మోతలు, చమురు దేశాల్లో కలకలంప్రపంచశాంతి నినాదం,కరువైంది. ప్రాణనష్టం, ఆస్తుల నష్టంగురించి ఆలోచించి అడుగు ముందుకు వేయాలి. సామాజిక అభివృద్ధి,మానవ హక్కులుకాపాడేందుకు 1945 సంవత్సరంలో న్యూయార్క్ నగరంలో ఏర్పాటు అయింది. చట్టం, భద్రత, సామాజిక అభివృద్ధి మానవ హక్కుల పరిరక్షణ ఈ సంస్థ ప్రధాన కర్తవ్యం.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, హైదరాబాద్

### అహంకారం వీడితేనే..

ఎన్ని అపజయాలు అవమానాలు ఎదురైనాయి మూర్ఖంగా ఉంటారు, అహంకారాన్ని వదిలిపెట్టరు ధుర్యోధనుడిలాగానే ఈమధ్య కొందరు రాజకీయ నాయకులు ప్రవర్తిస్తున్నారు. శాసనసభ, లోక్‌సభ ఆ తరువాత రెండు ఉప ఎన్నికలు. ఈ మధ్య జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పరాజయం పాలైన వారి అహంకారం తగ్గటం లేదు. పరనింద, ఆత్మస్తుతి మానటం లేదు..

-మిథునం, హైదరాబాద్

### కాలం చెల్లిన పద్ధతులను వీడాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రపంచ శాంతి పరిరక్షణలో తన బాధ్యతలను ఆశించినస్థాయిలో నెరవేర్చలేకపోతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం,గజాలో ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలు నేటికీ కొనసాగుతుండటమే ఇందుకు నిదర్శనం. శాశ్వత సభ్య దేశాలైన రష్యా, అమెరికా వంటి అగ్రరాజ్యాలు తమ వీటో అధికారంతో శాంతి ప్రయత్నాలను అడ్డుకుంటూ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ అధికార దుర్వినియోగంవల్ల మానవతా దృక్పథంతో కూడిన నిర్ణయాలు అమలుకావడంలేదు. పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ ప్రత్యక్ష దాడులు, ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దు వివాదాలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. కాలం చెల్లిన పద్ధతులను వీడి నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పుడే ఐక్యరాజ్యసమితి తన ఉనికిని చాటుకోగలదు, ప్రపంచ వ్యాప్తంగా శాంతిని నెలకొల్పగలదు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అందరూ మోసగాళ్లే..

బిఆర్ఎస్ తమను మోసం చేసిందని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లువేసి అధికార పీఠాన్ని అందించారు.కాంగ్రెస్ కూడా బిఆర్ఎస్ లానే మోసం చేస్తే మూడేళ్ల తరువాత జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తప్పించి ప్రజలు మరో పార్టీని ఎన్నుకుంటారు. అయితే ఈ కాలంలో పార్టీల నుంచి ప్రభుత్వాల నుంచి స్వచ్ఛమైన పాలనఆశించడం వృధా.ఎందుకంటేరాజకీయ వ్యవస్థలో నైతికవిలువలు పార్టీనాయకుల్లో నిజాయితీ లోపించాయి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ప్రాంతీయ యుద్ధం

వేనిజులలో లాగ అధ్యక్షుణ్ణి అపహరించడం సులభం అవుతుంది. భయపెట్టి తమ చెప్పుచేతల్లో ఉంచుకునే నాయకుడిని గద్దె ఎక్కించడం వీలు అవుతుంది అనుకున్న ట్రంప్ ఆశలు అడియశలు అయ్యాయి.ఖొమేనీ మరణంతో శియాలు కోపంతో ఉన్నారు. ఇరాన్ ఇప్పటికి అమెరికాతో చర్చలకు సిద్ధం అంటున్నది అనేదికాదు అనలేనివాస్తవం. 1979లో ఇరానియన్ విప్లవంలో ఎదురయినా అవమానానికి బదులు తీర్చుకోవాలి అని అమెరికా చూస్తున్న నేపథ్యంలో ఇంకా గల్ఫ్ దేశాలు యుద్ధ రంగంలోకి దిగలేదు. ఇది అమెరికా ఇజ్రాయేల్, ఇరాన్ మధ్యనే కాదు ఇది ఒక ప్రాంతీయ యుద్ధంకు దారితీయబోతోంది అనేది కాదు అనలేని వాస్తవం.ఇదికావాలి అని చేసే యుద్ధం మాత్రమే.

-భారత అవినాష్, జనగామ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గాడి తప్పిన పాడి

**ఒక వ్యక్తి త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేస్తే ఎంత చేయవచ్చో కురియన్ చేతల్లో చూపెట్టారు. గుజరాత్ పాల సహకార సంఘాల ఉత్పత్తి ఆనాడు రెండువందల నలభైఏడు లీటర్లు. ఇప్పుడది నాలుగు వందల కోట్ల లీటర్లకుపైగా చేరింది. ప్రపంచంలో భారీగా పాల ఉత్పత్తి చేసి భారతదేశానికి ఖ్యాతి గడించింది. అమూల బ్రాండ్‌కు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కురియన్ సాధించిన క్షీర విప్లవం వల్ల దేశంలో కోట్లాది మంది రైతు కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడ్డారు. ఒకనాడు ఆయన ఉండటానికి చిన్న ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడని గ్రామస్తులకు ఆయన ఆరాధ్యదైవం అయ్యారు. కోట్లాది మంది అన్నదాతల ఇళ్లల్లో దీపం వెలిగించిన కురియన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

మానవుడికే కాదు,పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సవాలుగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ అన్నింటికంటే మించి వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు పౌష్టికాహారంగా సేవించే పాలల్లోకల్తీ ప్రమాదకరంగా మారుతున్నది. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. గత నెలలో ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీపాలు తాగి పది మందికిపైగా మరణించారు. మరికొందరు ఇప్పటికీ ఆస్పత్రుల్లో మృత్యు వుతో పోరాడుతున్నారు. అంతెందుకు కలియుగదైవం కోట్లాది మందికి ఇలవేల్పు తిరుమల వెంకన్న కూడా ఈ కల్తీ నుండి తప్పించుకోలేకపోయారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ప్రసాదం లడ్డూ కల్తీ నెయ్యితో తయారు చేసినట్లు బయటపడింది. ఒక్క లీటరు పాలు లేకుండానే కోట్లాది రూపాయల విలువైన నెయ్యిని తయారు చేసి దేవునికి సమర్పించి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. ఇదేదో మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ వ్యాపారమే. యూరియా లాంటి రసాయనిక ఎరువులను కలిపి తయారు చేసిన పాలను అమ్ముతున్నారు. గుజరాత్‌లో ఇటీవల అనుమతి లేకుండా నడుస్తున్న ఓ డెయిరీపై అధికారులు దాడులు చేస్తే విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. మూడు వందల లీటర్ల పాలల్లో డిటర్జెంట్, యూరియా, కాస్టిక్‌సోడా కలిపిన 18వందల లీటర్ల ద్రావణాన్ని మిక్స్ చేసి ప్యాకెట్ పాలుగా విక్రయిస్తు న్నట్లు అధికారులు గుర్తించారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లలో అధికారులు జరుపుతున్న ఆకస్మిక దాడు ల్లో లక్షలాది రూపాయలు విలువైన టన్నుల కొద్దీ నకిలీ నెయ్యి పట్టుబడింది. అసలు స్వచ్ఛమైన పాల లభ్యత అనేది సమస్యగా మారిపోయింది. వాస్తవంగా చూస్తే యేడాదియేడాదికి పాల వినియోగం అంతకంతకు పెరుగు తుంటే అందుకు అనుగుణంగా ఉత్పత్తులు ఆ స్థాయిలో పెరగడం లేదు. పాల ఉత్పత్తులు పెంచేందుకు అటు రాష్ట్రాలు కానీ, ఇటు కేంద్ర ప్రభుత్వం కానీ ప్రవేశపెడు తున్న పథకాలు అంతగా ఫలితాలు ఇవ్వడం లేదు. గత రెండు,మూడు దశాబ్దాలుగా భారీఎత్తున చిన్నకారు రైతులకు సమృద్ధిగా పాలు ఇచ్చే సంకరజాతి ఆవులను, గేదెలను సరఫరా చేశారు, చేస్తున్నారు. కానీ అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో గిట్టుబాటుకాక అధిక శాతం రైతులు పాడిపశువులను అమ్ముకున్నారు. ముఖ్యంగా భూముల విలువలు పెరిగిపోయిన తర్వాత బీడుభూములు, ప్రభుత్వ భూములు దాదాపు అదృశ్యమైపోయాయనే చెప్పొచ్చు. ఉన్నా వాటి చుట్టూ ఆక్రమణలకు గురికాకుండా కంచెలు వేసుకున్నారు. దీంతో పశువులు తిరిగి మేయడానికి భూములు కరవైనాయి. అందుకే చిన్న రైతులు పాడికి మంగళం పాడుతున్నారు. ఇక డెయిరీల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. చిన్నాచితక డెయిరీలు పెద్ద సంఖ్యలో మూతపడ్డాయి. దాణాధరలు పెరగడం గిట్టుబాటు కాకుండా పోయాయి. వీటన్నింటికంటే మించి ఉపాధి హామీ పథకం ఏమేరకు ఉపయోగపడిందే ఏమో కానీ వ్యవసాయ రంగం, ప్రధానంగా పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలనుండి వలస కూలీలు రాకపోతే ఉన్న కొద్దిపాటి డెయిరీల పరిస్థితి ప్రశ్నార్థకమే. ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్ట మైన ప్రణాళిక

## ఒక్క మాట

లేకపోవడం, పాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. వాస్తవంగా చూస్తే మన పూర్వీకులు పశు సంపదకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఒకనాడు రాజుల సంపద వారికున్న గోవులతోనే అంచనా వేసేవారు. వ్యవ సాయ అనుబంధ రాబడి పెంచితే తప్ప కోట్లాది గ్రామీణ పేదల పరిస్థితి మెరుగుపడదని మహాత్ముడు ఎన్నోసార్లు వక్కాణించారు. పాల ఉత్పత్తి అందుకు ఒకమార్గం. ఆ కోణంలో ఆనాటి పాలకులు ప్రయత్నించారు. పాలనిల్వలకు ఆనాడు దేశంలో సదుపాయాలు లేకపోవడం, పాల పొడిని తయారు చేస్తే వర్షాకాలంలో మిగులు, ఎండాకాలంలో కొరతను అధిగమించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించ వచ్చుననే అభిప్రాయాలు స్వాతంత్ర్యం సాధించిన మొదట్లోనే వెల్లడయ్యాయి. నెదర్లాండ్ నుంచి ఆయా కంపెనీల ప్రతినిధులను పిలిపించి భారత్‌లో సర్వేచేయించారు. బహిరంగ మరుగుదొడ్ల వినియోగం వల్ల వాతావరణం అంతా బాక్టీరియాతో కలుషితమైందని ఆవుపాలతో తప్పగేదె పాలతో కండెన్సీ పాలను తయారు చేయలేమని వారు నిస్సహా యత వ్యక్తం చేశారు. ఆనాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జోక్యం వర్ఘీస్ కురియన్ రంగప్రవేశం చేసి గేదెపాలతో పాశ్చాత్య దేశాలకు దీటుగా కండెన్సీ పాలను తయారు చేశారు. నిజం చెప్పాలంటే భారతదేశంలో క్షీరవిప్లవానికి నాంది పలికిన వ్యక్తి కురియన్. కురియన్ ప్రస్తావన వచ్చింది కనుక ఆయన గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ రాష్ట్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కురియన్ ఆనాటి బ్రిటిష్‌ప్రభుత్వం స్కాలర్‌షిప్‌తో అమెరికాలో చదువు పూర్తి చేసుకొని గుజరాత్‌లో 'ఆనంద్' అనే గ్రామంలో ఒక చిన్న పరిశ్రమలో ఉద్యోగిగా చేరారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సహచరుడు కేశవ్‌భాయ్ పటేల్ కురియన్‌లో దాగి ఉన్న అసాధారణ ప్రతిభను గుర్తించి అప్పటికే తమగ్రామంలో నష్టాల ఊబిలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారులసంఘం నిర్వహణకు సహ కరించమని అభ్యర్థించారు. ఆయన ప్రవేశంతో ఆ పాల సంఘాల రైతుల ఆర్థిక పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. పాల ఉత్పత్తి ఉద్యమంగా గుజరాత్ రాష్ట్ర మంతటా విస్తరించిన సమాచారం ఢిల్లీకి చేరింది. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ కొంత ప్రోత్సాహం అందించారు.ఆ తర్వాత ప్రధానిగా వచ్చిన లాల్‌బహదూర్ శాస్త్రి విషయం తెలుసుకొని క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు గ్రామంలోని రైతు ఇంటికి స్వయంగావెళ్లారు. కానీ ఆ రైతుకు తన ఇంటికి వచ్చింది ఎవరో తెలియదు. ఆ రాత్రి శాస్త్రి రైతు ఇంట్లోనే ఉండి ఆ కుటుంబం మొత్తానికి తానే స్వయంగా రొట్టెలు చేసి ఇచ్చారట. అలావారిని మాటల్లో దింపి పాలఉత్పత్తిలోని సాధక బాధకాలను, వారు నష్టాల ఊబి నుంచి ఎలా విజయ పథం వైపు నడిచారో తెలుసుకున్నారు. మరుసటి రోజు ఉదయం అధికారులు వచ్చి శాస్త్రిని కలిసేవరకు తమ ఇంటికి వచ్చింది, తమతో గడి పింది దేశ ప్రధాని అనే విషయం ఆ రైతుకు కానీ,ఆ గ్రామ ప్రజలకు కానీ తెలియదు. అక్కడ పరిస్థితులను గమనించిన శాస్త్రి జాతీయ స్థాయిలో నేషనల్ డెవలప్‌మెంట్ బోర్డు స్థాపిస్తానని దానికి నేతృత్వం వహించేందుకు ఢిల్లీకి రమ్మని ఎంతగా కోరినా కురియన్ మర్యాద పూర్వకంగా తిరస్కరించారు. తాను అక్కడికి రాలేనని, ఒకవేళ వచ్చినా ఉపయోగం ఉండదని, అక్కడ అధికారులు, ఉద్యోగులు తప్ప రైతులుండరని కురియన్ శాస్త్రికి సూటిగా చెప్పారు. ఆయనమాట ల్లోని వాస్తవాన్ని, ఆంతర్యాన్ని గ్రహించి లాల్‌బహుదూర్ శాస్త్రి నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు కేంద్ర కార్యా లయాన్ని ఢిల్లీలో కాకుండా కురియన్ ఉంటున్న ఆనంద్ గ్రామంలోనే నెలకొల్పి సారధ్య బాధ్యత అప్పగించారు. ఒక వ్యక్తి త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేస్తే ఎంత చేయవచ్చో కురియన్ చేతల్లో చూపెట్టారు. గుజరాత్ పాలసహకార సంఘాలఉత్పత్తి ఆనాడు రెండువందల నలభైఏడు లీటర్లు. ఇప్పుడది రోజుకు నాలుగు వందల కోట్ల లీటర్లకుపైగా చేరింది. వార్షిక ఆదాయం అరవై ఐదువేల కోట్లకుపైగా చేరుకు న్నది. ప్రపంచంలో భారీగా పాలఉత్పత్తి చేసి భారతదేశానికి ఖ్యాతి గడించింది.అమూల బ్రాండ్‌కు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభించింది. కురియన్ సాధించిన క్షీర విప్లవం వల్ల దేశంలో కోట్లాదిమంది రైతు కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడ్డారు. ఒకనాడు ఆయన ఉండటానికి చిన్న ఇల్లు ఇవ్వడానికి ఇష్టపడని గ్రామస్తులకు ఆయన ఆరాధ్య దైవం అయ్యారు.కొందరు రైతులు తమ పిల్లలకు కురియన్ పేరు పెట్టుకు న్నారు. కోట్లాది మంది అన్నదాతల ఇళ్లల్లో దీపం వెలిగిం చిన కురియన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. అంతటి అంకిత భావంతో పనిచేయకపోయినా ఆ బాటలో పయనించే దిశగా పాలకులు చర్యలు చేపడితే అవసరం మేరకు పాలఉత్పత్తి పెరుగుతుంది.అలాగే కల్తీయే తమ వ్యాపకంగా మార్చుకొని అమాయకుల జీవితాలను కబళిస్తున్న దళారులను ఉక్కుపాదంతో అణిచివేయాలి.

# పేదల పాలిట వరం జనరిక్ ఔషధాలు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారత ప్రభుత్వ రసాయనాలుఎరువుల మంత్రిత్వశాఖ నేతృత్వంలో ప్రతి ఏటా 01 మార్చి నుంచి 07 మార్చి వరకు జన ఔషధి వారోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించబడుతున్నాయి. ఈ వారోత్సవాల చివరి రోజు 07 మార్చి రోజున 'జనరిక్ ఔషధాల దినోత్సవం" లేదా 'జన ఔషధి దివస్' కూడా పాటించడం గత 8 ఏండ్లుగా ఆనవాయితీగా మారింది. దేశవ్యాప్తంగా 250కి పైగా ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉచితంగా ఆరోగ్య తనిఖీ శిబిరాలు నిర్వహిస్తోంది. సరసమైన ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమా లక్ష్యంగా 8వ జనరిక్ ఔషధాల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతున్నది. జనరిక్ ఔషధాలు, ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక వ్యాధులు, పిల్లల సంరక్షణ, నెఫ్రాలజీ, మధుమేహం, కంటి పరీక్షలు, ఫిజియోథెరపీ లాంటి సేవలు ఈ కేంద్రాల ద్వారా సామాన్య ప్రజలకు ఉచితంగా అందుతున్నాయి. జనరిక్ ఔషధాలు భద్రత, నాణ్యత, సామర్థ్యాలకు ప్రతీకల్ని తెలుసుకోవాలి. బ్రాండెడ్ మందులకు సమానమైన ప్రత్యామ్నాయమైన ఔషధాలుగా జనరిక్ ఔషధాలు పేద ప్రజలకు ఆర్థిక భద్రతను, ఆరోగ్య సురక్షను కలిగిస్తున్నాయి. ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కింద స్థాపించబడిన ప్రధానమంత్రి జన ఔషధం కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. జన ఔషధీ సప్తాహ్ (జనరిక్ ఔషధాల వారోత్సవాలు)" వేదికగా ఉచిత సాధారణ పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు పర్యవేక్షణ, థైరాయిడ్ పరీక్షలతో పాటు విస్తృత శ్రేణి సేవలను అందిస్తున్నారు. ఈ శిబి



రాల్లో జనరిక్ ఔషధాలను ఉచితంగా అందిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 18,000లకు పైగా జన ఔషధి కేంద్రాలు పని చేస్తున్నాయి. మార్చి 2027నాటికి వీటిని 25వేల వరకు పెంచడానికి పటిష్ట చర్యలు అమలు చేస్తున్నారు. బ్రాండెడ్ ఔషధాల ధరలతో పోల్చితే జనరిక్ ఔషధాల ధరలు 30 నుంచి 80 శాతం వరకు తక్కువగా ఉండడం వల్ల సామాన్య రోగులకు జనరిక్ ఔషధ కేంద్రాలు వరంగా మారుతున్నాయి. జన ఔషధి దివస్2026 ఇతివృత్తంగా "జన ఔషధి సస్తీ భీ, భరోసే మంద్ భీ, సహత్ కీ బాత్, బచత్ కే సాథ్ (చవకైన, నాణ్యమైన జనరిక్ ఔషధాలతో సంపూర్ణ ఆరోగ్యం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. జన ఔషధీ కేంద్రాలను గుర్తించడానికి, మందులను పొందడానికి జన ఔషధీసుగం" మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తేవడం హర్షదాయకం. ధరలు తక్కువ.. నాణ్యత ఎక్కువ, లేదా దామ్ కమ్ దవాయి ఉత్తమ్" నినాదంతో జన ఔషధీ దినోత్సవం పేద ప్రజల ఆరోగ్య సంరక్షణలో మరింత ఉత్తమమైన సేవలను అందించారని కోరుకుందాం. అధిక ధరలు కలిగిన బ్రాండెడ్ ఔషధాలకు బదులు అత్యంత చవకైన జనరిక్ ఔషధాలను వాడుకుందాం. ఆర్థిక, ఆరోగ్య సంరక్షణకు జనరిక్ ఔషధ కేంద్రాలను సందర్శిద్దాం. బ్రాండెడ్ మందులు ఆకర్షణీయమైన పేర్లతో అందుబాటులో ఉన్నప్పటికీ, జనరిక్ ఔషధాలు మాత్రం ప్రధాన రసాయన సమ్మేళనం పేరుతో అమ్మబడుతాయి. పౌర సమాజాన్ని జనరిక్ ఔషధాల పట్ల చైతన్యం కలిగిద్దాం. నాణ్యతలో రాజీ పడని జనరిక్ ఔషధాలు, నేడు మార్కెట్‌ను ముంచెత్తుతున్న బ్రాండెడ్ మందులకు పోటీగా, బయో ఈక్వలెంట్ నిలబడుతున్నాయని గమనించి పేద ప్రజలు చైతన్యవంతులై జనరిక్ మందులను విధిగా వాడాలి.

# రెండు వేల యేళ్ల కుల వివక్ష ఇంకెన్నాళ్లు?



పురుషోత్తం నారగౌని

మనం అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతున్నాం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు సృష్టిస్తున్నాం. దేశం 'విశ్వగురు' స్థానానికి ఎదుగుతోందని జబ్బలు చరుచుకుంటున్నాం. కానీ, మన పల్లెల్లో పేరుకుపోయిన కుల అహంకారపు చీకట్లను మాత్రం పారద్రోలలేకపోతున్నాం. మనుషులంతా సమానమే అని చాటిచెప్పే దేవాలయాల సాక్షిగా, దైవ దర్శనానికి వెళ్లిన ఒక దళిత బహుజన జంటపై అగ్రవర్ణ అహంకారం పడగవిప్పిన తీరు.. ఆ దాష్టీకానికి రెండు నెలల పసికందు ఫుట్‌బాల్‌లా ఎగిరిపడి ప్రాణాలు వదిలిన ఉదంతం యావత్ తెలంగాణ సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసింది. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన ఈ అమానుషం కేవలం ఒక శిశువు హత్య కాదు, మన వ్యవస్థీకృత సామాజిక మనస్సాక్షికి పట్టిన నిలువెత్తు క్యాన్సర్‌కు సజీవ సాక్ష్యం. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలోని మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర ఎంతో పవిత్రమైనది. ఆ పవిత్రతను కాపాడాల్సిన నిర్వాహకులే రాక్షసులుగా మారారు. గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన భార్య,భర్తలు తమ రెండు నెలల పసిపాపతో కలిసి దేవుడి ఆశీస్సుల కోసం జాతరకు వెళ్లారు. కులాంతర ఆదర్శ వివాహం చేసుకుని తమ బతుకుదెరువు తాము చూసుకుంటున్న ఆ నిరుపేద దంపతుల పాలిట అగ్రకులఅహంకారం యమపాశంగా మారింది. ఆలయం వద్ద భక్తుల నుంచి అక్రమంగా రూ.100 వసూలు చేస్తుండటాన్ని ప్రశ్నించడమే ఆ దంపతులు చేసిన నేరమైంది. బహుజన, దళిత వర్గాలకు చెందిన వారు తమను నిలదీయడాన్ని అక్కడి పెత్తందారులు జీర్ణించుకోలేకపోయారు. 'నీ కులమేంటి? గుళ్లోకి వస్తావా?' అంటూ కులం పేరుతో అసభ్యంగా దూషిస్తూ సర్పంచ్, మరికొందరు అనుచరులు ఆ దంపతులపై భౌతిక దాడికి దిగారు. ఈ అమానుషమైన తోపులాటలో తల్లి చేతిలోని పసికందు కిందపడిపోవడం, దయలేని ఒక కసాయివాడు ఆ రెండు నెలల పసిపాపను కాలుతో ఫుట్‌బాల్‌ను తన్నినట్టు తన్నడం అత్యంత పాశవికం. అంతర్గత గాయాలతో విలవిలలాడిన ఆ శిశువు, ఆసుపత్రిలో మృత్యువుతోపోరాడి కన్నుమూసింది. కడుపుబ్బ నవ్వాల్సిన వయసులో, గుక్కెడు పాలు తాగే ఆ పసికందు వాళ్లకు ఏ ద్రోహం చేసిందని అంత కిరాతకంగా చంపేశారు? ఈ కుల ఉన్మాదంఈనాటిది కాదు. కారంచేడు, చుండూరులలో దళితుల నెత్తుటి మరకలు ఇంకా పూర్తిగా చెరిగిపోలేదు.మొన్నటికి మొన్న మిర్యాలగూడలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత



యువకుడు ప్రణయ్‌ని నడిరోడ్డుపై నరికి చంపిన అగ్రకుల అహంకారం.. నేడు కుమ్మెరలో పసికందు ప్రాణం తీసింది. గుళ్లోకి వెళ్లినందుకు దళితులను చెట్లకు కట్టేసి కొడుతున్న ఘటనలు, గుడి మైలపడిందని అపరాధ రుసుములు విధిస్తున్న దారుణాలు ఈ 'డిజిటల్ ఇండియా'లో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. కులాంతర వివాహం చేసుకుని, తల ఎత్తుకుని బతుకుతున్న దళిత, బహుజన దంపతులు దైవ దర్శనానికి వెళ్లడం ఈ ఆధునిక యుగంలో కూడా నేరమేనా? అక్షరాస్యత పెరిగినా, ఆర్థికంగా ఎదిగినా,కుల వివక్ష అనే జబ్బుకు మాత్రం సమాజం ఇంకా చికిత్స కనుక్కోలేకపోతోంది అనడానికి కుమ్మెర ఘటనే నిదర్శనం. ఈ ఘటనలో కుల అహంకారం ఎంత దారుణమో, పోలీసు వ్యవస్థ వ్యవహరించిన తీరు అంతకంటే దారుణం. ఒక పసికందు ప్రాణాపాయ స్థితిలో ఉంటే, బాధిత దంపతులు పోలీసుల వద్దకు వెళ్తే కనీసం ఫిర్యాదు తీసుకునే నాథుడే కరువయ్యాడు. పైగా, దాడి చేసిన అగ్రవర్ణ పెత్తందారులు ఇచ్చిన కౌంటర్ ఫిర్యాదును ఆధారం చేసుకుని, బిడ్డను పోగొట్టుకున్న ఆ అభాగ్యులపైనే పోలీసులు కేసులు నమోదు చేయడం వ్యవస్థ పనితీరుకు పరాకాష్ట. పసిపాప చనిపోయిన తర్వాత కూడా నిందితులపై తక్షణమే హత్య కేసు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా పోలీసులు మీన మేషాలు లెక్కించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ప్రధాన నిందితుడైన సర్పంచ్‌కు స్థానిక పాలకుల అండదండలు ఉండటం వల్లే పోలీసులు బానిసల్లా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను ఎలా కొట్టిపారేయగలం? రక్షక భటులే భక్షకులకు వత్తాసు పలికితే ఇక సామాన్యుడికి ఈ దేశంలో రక్షణ ఎక్కడుంది? ఈ దారుణంపై రాష్ట్రవ్యాప్తంగా దళిత, బహుజన, ప్రజాసంఘాలు భగ్గుమన్నాయి. వ్యవస్థలు నిద్రావస్థలో ఉన్నప్పుడు, ఒక న్యాయవాది ఫిర్యాదు మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) సుమోటోగా కేసు నమోదు చేయడం వ్యవస్థలో ఇంకా మిగిలి ఉన్న కొంత న్యాయానికి ఆశాకిరణం. రాజకీయ పార్టీలు, పౌర హక్కుల సంఘాలు వీధుల్లోకి వచ్చి నినదిస్తే తప్ప పోలీసుల కళ్లు తెరచుకోకపోవడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. ఇది కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ కాదు. తరతరాలుగా మన నరనరాన జీర్ణించుకుపోయిన కుల వివక్షకు సజీవ రూపం. గుడి తలుపులు అందరికీ తెరిచే ఉంటాయని చెబుతున్న వ్యవస్థలో, కులం పేరుతో ప్రవేశం నిరాకరించేహక్కు ఈ పెత్తందారులకు ఎవరిచ్చారు? బిడ్డకు పాలివ్వాల్సిన తల్లి, ఆ పసికందును మట్టిలో పూడ్చిపెట్టి న్యాయం కోసం రోడ్ల చుట్టూ తిరుగుతున్న దృశ్యం పాలకుల గుండెలను ఎందుకు కరిగించడం లేదు?ఈ దారుణానికి బాధ్యులైన వారిపై తక్షణమే హత్యానేరం కింద కేసులు నమోదు చేసి కటకటాల వెనక్కి నెట్టాలి. నిందితులకు వత్తాసు పలికి, బాధితులపైనే కేసులు పెట్టిన పోలీసు అధికారులను తక్షణమే విధుల్లోంచి తొలగించాలి. అప్పుడే ఆ పసికందు ఆత్మకుశాంతి దొరుకుతుంది. లేదంటే ఇలాంటి దారుణాలు పునరావృతం అవుతూనే ఉంటాయి, చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతాయి. పాలకులూ కళ్లు తెరవండి! సమాజమా ప్రశ్నించడం నేర్చుకో!

(రచయిత: సీనియర్ జర్నలిస్ట్)

## సివిల్స్‌లో మెరిసిన 20 మంది రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం లబ్ధిదారులు

### సింగరేణి ఉద్యోగి కుమార్తె జి.సృజనకు ఆల్ ఇండియా స్థాయిలో 55 ర్యాంకు

### విజేతలకు అభినందనలు తెలియజేసిన ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 6:** ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఒ ప్రకటన విడుదల చేశారు.ముఖ్యంగా సివిల్ సర్వీసెస్‌లో తెలంగాణ యువత రాణించాలన్న లక్ష్యంతో సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందుకున్న 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో విజేతలుగా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ యువత ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగి జి.రాజేశం కుమార్తె జి. సృజన జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించడంపై సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ విజేతలకు అభినందనలు తెలిపారు. ఇదీ నేపథ్యం... ఈ పథకం కింద ఈ ఏడాది 202 మంది ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులు అయిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీరిలో 51 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారికి మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక చేయూత అందించారు.. వారిలో ఈ రోజు ప్రకటించిన ఫలితాల్లో 20 మంది విజేతలుగా నిలిచారు. గత ఏడాది ప్రారంభించిన పథకంలో తొలుత 140 మంది ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి సాయం అందించారు.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సింగరేణి సంస్థ ఆర్థిక సహాయం పొంది సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజేతలుగా ఎంపికైన 20 మందిలో 10 మంది ఓబీసీ అభ్యర్థులు, నలుగురు ఎస్టీ అభ్యర్థులు, ముగ్గురు చొప్పున ఎస్సీ, జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఉండటం విశేషం. మొత్తం మీద 16 మంది పురుష అభ్యర్థులు, 4 మంది మహిళా అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. అత్యధికంగా రంగారెడ్డి నుండి ఐదుగురు, మేడ్చల్ మల్కాజగిరి, వరంగల్ అర్బన్ నుండి ముగ్గురు చొప్పున ఎంపిక కాగా ములుగు, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల నుండి ఒక్కొక్కరు ఎంపిక అయ్యారు.

## రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన పూర్తి

### ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

### అభిషేక్ సింఘ్వీ, నరేందర్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 6:** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పత్రాలు పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలు ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు వివరణ ఇచ్చారు. అందువల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అభిషేక్ సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది. మొదట రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది.ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి .. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేశారు. వివాదరహితుడు కూడా కావడంతో.. ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కాగా, వీరిద్దరి నామినేషన్లు ఏకగ్రీవం అయ్యాయి. నామినేషన్ల ఉపసంహారణకు 9వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు సమయం ఉండటంతో ఈ మేరకు అదేరోజు సాయంత్రం 4 గంటల సమయంలో వారిద్దరికి రాజ్యసభసభ్యులుగా ఎన్నికైనట్లుగా అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి సర్టిఫికేట్లు అందజేయనున్నారు.

## 'స్టాండ్ విత్ హర్.. మెన్ స్టాండింగ్ ఫర్ ఉమెన్'

### నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా భద్రతా విభాగం (డబ్ల్యు ఎస్‌డబ్ల్యు) మహిళల రక్షణకు మరో వినూత్న కార్యక్రమాన్ని చేబట్టనుంది. 'స్టాండ్ విత్ హర్.. మెన్ స్టాండింగ్ ఫర్ వుమెన్' పేరిట ఏర్పాటైన ఈ కార్యక్రమం జెఎన్‌టియు ఆడిటోరియంలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభం కానుంది. డిజిపి శివధర్‌రెడ్డిసహా డబ్ల్యు ఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారుసిన్హా సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరు కానున్నారు. మహిళలపై జరిగే హింసను అరికట్టడంలో పురుషులు బా ధ్యత తీసుకోవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. మహిళలపై జరిగే హింస పెద్ద నేరాల రూపంలో కాకుండా చిన్న నేరాలు, అనుచిత ప్రవర్తనలతో మొదలవుతుందని డబ్ల్యుఎస్‌డబ్ల్యు అదనపు డిజి చారు సిన్హా శుక్రవారం మీడియాకు తెలిపారు. మహిళలపై అసభ్యకరమైన జోకులు వేయడం, వెంబడించడం, ఆన్‌లైన్‌లో వేధించడం, అనుచితంగా తాకడం. లైంగికంగా వేధించడం, దాడులకు దిగడం వంటివి మహిళల భద్ర తకు ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తాయని ఆమె తెలిపారు. డబ్ల్యుఎస్‌డబ్ల్యు నిర్వహిస్తున్న స్టాండ్ విత్ హర్...మెన్ స్టాండింగ్ ఫర్ వుమెన్ కార్యక్రమం ద్వారా మహిళలు తమను తాము రక్షించుకోవాలి అనే భావనను మార్చి మహిళల భద్రత సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందే శాన్ని అందించాలనేది తమ ఉద్దేశమని చారు సిన్హా తెలిపారు.



అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

## రాష్ట్రానికి మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

**హైదరాబాద్ (తార్నాక), మార్చి 6, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రానికి మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి రానుంది. తమిళనాడు రాష్ట్రంలోని నాగర్‌కోయిల్ నుంచి తెలంగాణలోని చెర్లపల్లి వరకు నడిచే ఈ కొత్త రైలును త్వరలో ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలులో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానించే ఈ రైలు ప్రారంభం వల్ల దీర్ఘదూర ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం కలగనుంది. ప్రత్యేకంగా దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ రైలుకు సంబంధించిన పూర్తి వివరాలు, స్టాపేజీలు, టైమ్‌టేబుల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

# వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తాం

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**భువనేశ్వర్, మార్చి 6:** దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచి పెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఒడిశాలోని కటక్‌లో జరిగిన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం 57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం మావోయిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న తిరుపతి నుంచి పశుపతి వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించాలనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు. నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కృషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ఠ వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరించారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హోం మంత్రి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మావోయిజం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోందని అమిత్ షా వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు వేగంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ఆ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధికి చిహ్నాలుగా మారుతున్నాయని, గిరిజన బిడ్డలకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

## యూరియా యాప్‌లో కీలక మార్పులు

### ఇకపై జిల్లా కాకుండా మండలం, నియోజకవర్గం యూనిట్

### యాప్‌ను దుర్వినియోగం చేసే ప్రైవేటు డీలర్లపై కఠినచర్యలు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో యూరియా పంపిణీ కోసం ప్రారంభించిన యాప్‌లో కీలక మార్పులు చోటు చేసుకోబో తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా యూనిట్‌గా యూరియా పంపిణీ జరగ్గా ఇక నుంచి మండలం లేదా రెండు మండలాలు లేదా నియోజకవర్గం ప్రాతిపాదికన యూరియా పంపిణీ జరగనున్నట్లు వ్యవసాయ శాఖ అధికా రులు తెలిపారు. ఆ మేరకు యాప్‌లో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. యూరియా పంపిణీ సరిగ్గా నిర్వహించని ప్రైవేట్ డీలర్లపై కూడా తెలంగాణ ప్రభుత్వం నిఘా పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో యూరియా పంపిణీని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ యాప్ వినియోగంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వివిధ రకాల సమస్యలు ఎదురవుతున్నాయి. స్లాట్ బుకింగ్ సరిగ్గా కాకపోవడం, దుకాణానికి వెళ్లినా అక్కడ నిల్వలు ఉండకపోవడం వంటి సమస్యలు ఎదురవ్వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. యూరియా పంపిణీ యాప్‌ను సులభంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాల్లోని వ్యవసాయ అధికారులు సమస్యలపై సమాచారం సేకరించి విశ్లేషణ చేశారు.ప్రస్తుతం జిల్లా యూనిట్‌గా యూరియా పంపిణీ జరుగుతుండగా రైతులు యాప్‌లో తమ జిల్లాల పరిధిలోని దుకాణాలను బుకింగ్ చేసుకుంటున్నారు. దీని కారణంగానే జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రద్దీ ఏర్పడుతోంది. యూరియా నిల్వలపై సమాచారం నమోదు అవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటన్నింటినీ పరిశీలించిన అధికారులు జిల్లా యూనిట్ స్థానంలో మండలం లేదా నియోజకవర్గాల వారీగా పంపిణీ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు 'మహిళాశక్తి అచీవ్‌మెంట్స్' ప్రత్యేక పుస్తకం

### ఆవిష్కరించనున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి అచీవ్‌మెంట్స్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించనుంది. ఈనెల 8న ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం శిల్పకళా వేదికలో వేలాదిమంది మహిళల సమక్షంలో జరగనుంది. పుస్తకాన్ని రాష్ట్ర మహిళాశిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించనున్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని ఈ పుస్తకం ద్వారా నివేదించనున్నారు. 40 పేజీల ఈ పుస్తకం లో ఇందిరా మహిళా శక్తి ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతి, వినూత్న వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళా సంఘాలు, సభ్యుల విజయ గాథలను, ఫొటోలను పొందుపరిచారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి కోట్ల రూపాయల బ్యాంకు రుణాల వరకు స్వయం ఉపాధి నుంచి మహిళా వ్యాపార ప్రోత్సాహం వరకు, సంక్షేమం నుంచి స్వావలంబన వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు మహిళల జీవితాల్లో ఏవిధంగా స్పష్టమైన మార్పును తీసుకువస్తున్నాయో పుస్తకంలో వివరంగా ప్రభుత్వం పొందుపరిచింది. ఉచిత మహిళా బస్సు ప్రయాణ పథకం ద్వారా 30లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుం డడంతో 5వేలకోట్లు ఆదా అవుతున్నాయని, త్వరలో 65లక్షల మంది డ్వాక్రా మహిళలకు 30రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిం చనున్నామని, పట్టణ, గ్రామ మహిళా సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకురాబోతున్నామని ఇలా పలు పథకాల గురించి పుస్తకంలో వివరంగా పేర్కొన్నారు.

## మాదిగ జాతికి ద్రోహం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

### దొమ్మటి సాంబయ్యకు ప్రభుత్వ సలహాదారు పోస్టు ఇవ్వాలి

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, గోవిందు నరేష్‌మాదిగ తదితరులు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞత మరిచి మాదిగ జాతికి నమ్మకద్రోహం చేశాడని ఏ ప్రభుత్వ హయాంలో జరగని అన్యాయం రేవంత్ హయాంలోనే జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అనేక వేదికల మీద తన రాజకీయ ఎదుగుదలకు తన ఉన్నత స్థితికి నా జాతి నా వెంట ఉందో లేదో తెలియదు కానీ మాదిగ జాతి బిడ్డలు అడుగడుగునా నా వెంట ఉన్నారని, నేను ఈ స్థాయికి రావడానికి కారణం మాదిగ జాతి అని మాట్లాడి తన హయాంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో, రాజ్యసభలో, శాసనమండలిలో ఒక్క మాదిగకు కూడా అవకాశం ఇవ్వకుండా మాదిగ జాతికి తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. మాదిగ జాతి పట్ల కృతజ్ఞత మరిచి తన కులతత్వాన్ని ప్రదర్శించి తన రెడ్డి కులస్తుడైన వేం నరేందర్ రెడ్డికే రాజ్యసభ సీటు దగ్గరుండి ఇప్పించాడని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం వద్ద రాజ్యసభ సీటు ఎవరికి ఖరారు చేయాలని వేం నరేందర్ రెడ్డి, దొమ్మటి సాంబయ్య ఇద్దరి గురించి చర్చ జరిగినప్పుడు ఇప్పటికే కేబినెట్ హోదా కలిగి షాడో ముఖ్యమంత్రిగా ఉన్న తన కులస్తుడైన, మిత్రుడైన వేం నరేందర్ రెడ్డికే టికెట్ ఇప్పించుకున్నాడు కానీ ఉద్యోగం వదిలి రేవంత్‌రెడ్డినే నమ్ముకొని ఉన్న మాదిగ జాతి బిడ్డకు మాత్రం అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డికి మాదిగ జాతిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ ఖరారుతో ఖాళీ అయిన ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు పోస్టును మాదిగ బిడ్డ దొమ్మటి సాంబయ్యకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ, డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఇంజం వెంకట స్వామి మాదిగ, లత మాదిగ, టివి నరసింహా, డా.కొమ్ము శేఖర్ మాదిగ, మల్లికార్జున్ మాదిగ, బైరపోగు శివకుమార్ మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీడిసిఎల్ పరిధిలో 11,129 మెగావాట్లకు చేరిన గరిష్ట డిమాండ్

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 11,129 మెగావాట్లుగా రికార్డు అయింది. గత సంవత్సరం ఇదే రోజున గరిష్ట డిమాండ్ 10,310 మెగావాట్లు నమోదైంది. రబి పంటల సీజన్‌లో వ్యవసాయ అవసరాలకు తోడు, ఎండల తీవ్రత పెరగడంతో గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకుంటోంది. ఈ నెల 3వ తేదీన రాష్ట్రంలో మొత్తం విద్యుత్ డిమాండ్ 18,139 మెగావాట్లుగా నమోదైంది. తాజాగా శుక్రవారం ఎస్పీడీసీఎల్ పరిధిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 11,129 మెగావాట్లు గా నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ నెల 3న అక్కడ 4,421 మెగావాట్ల రికార్డు స్థాయి డిమాండ్ నమోదైంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో గత ఏడాది నమోదైన ఆల్‌టైమ్ రికార్డులు ఈసారి మార్చి మొదటి వారంలోనే అధిగమించడం విశేషం. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ రోజు గరిష్ట డిమాండ్ 2,459 మెగావాట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 2,326 మెగావాట్లు, మెదక్ జిల్లాలో 2,181 మెగావాట్లుగా నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వినియోగ దారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందిం చేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు.

## ఇది దండుగ ప్రచారపర్వం తప్ప మరోటి కాదు

### వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

### గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా చెత్తబుట్టలోనే

### కాంగ్రెస్ ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికపై మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 6:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వమని, ఇది ప్రజలను మభ్యపెట్టే మరో నాటకమని ఆయన ఎద్దేవా చేశారు. దాదాపు 800 రోజుల పాలనలో (రెండున్నరేళ్లు) చేసిందేమీ లేక, ఇప్పుడు ప్రజల దృష్టిని మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ కొత్త డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు.గతంలో రెండు సార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని హరీశ్‌రావు శుక్రవారం విమర్శించారు. ఆ దరఖాస్తులకే దిక్కులేదని, ఇప్పుడు మళ్లీ పది వారాలపాటు పది రకాల కార్యక్రమా లంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలనా వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాముల నుంచి తప్పించుకునేందుకే ఈ డైవర్షన్ ప్లాన్ రచించారని మండిపడ్డారు. మీ పాలనలో సగం కాలం పూర్తయినా ఇంకా ఎన్ని రోజులు ప్రచారాలతో నెట్టుకొస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పంట కోతల సమయం వచ్చినా ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేదని, గత సీజన్ పంట బోనస్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేక అన్నదాతలను నడిరోడ్డు మీదకు ఈడ్చారని, నమ్మించి గొంతుకోసిన ఈ మోసాల గురించి ఇప్పుడు గ్రామసభల్లో రైతులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అలాగే యువతకు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, జాబ్ క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో లూటీకి ప్రాధాన్యత ఇస్తూ, నోటిఫికేషన్లను గాలికి వదిలేశారని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు మూలనపడ్డాయని, ఇప్పుడు నైపుణ్య శిక్షణ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి అంటూ ప్రభుత్వం పేర్లు గొప్పగా చెబుతున్నా.. వాస్తవానికి ఆసుపత్రుల్లో మందులు లేక, బడుల్లో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయడం, పారిశుద్ధం నిర్వహించడం కనీస బాధ్యత అని, దానిని కూడా ఒక ఈవెంట్‌లా మార్చుకోవడం, గొప్పగా చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలన్నీ కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసమే తప్ప, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. పాలనను గాలికి వదిలి పబ్లిసిటీ గారడీలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హరీశ్ రావు హెచ్చరించారు.

## రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత

### డీహైడ్రేషన్‌పై జాగ్రత్తగా ఉండాలి: వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాబోయే 3 రోజుల్లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని.. ఈ నేపథ్యంలో ప్రజలందరూ డీహైడ్రేషన్‌పై జాగ్రత్తగా ఉండాలన పబ్లిక్ హెల్త్ డైరక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) హైదరాబాద్ ప్రకారం తెలంగాణలో రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుందని అంచనా వేసింది. ఈ విషయంలో తెలంగాణ పౌరులకు చేయవలసినవి, చేయకూడని వాటి గురించి డిహెచ్ సూచనలు చేశారు. దాహం వేయకపోయినా, వీలైనంత వరకు తగినంత నీరు త్రాగాలని సూచించారు. నిమ్మకాయ నీరు, పండ్ల రసాలు, ఉప్పు చక్కెర ద్రావణం వంటివి తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో నీటిని తీసుకెళ్లాలన్నారు. పుచ్చకాయ, కస్తూరి పుచ్చకాయ, నారింజ, ద్రాక్ష, పైనాపిల్స్, దోసకాయలతోపాటు స్థానికంగా లభించే ఇతర పండ్లు, కూరగాయలు వంటి అధిక నీటి శాతం కలిగిన కాలానుగుణ పండ్లు, కూరగాయలను తినాలని సూచించారు. వీలైనంత వరకు ఇంటిలోనే ఉండాలని, బాగా వెంటిలేషన్ ఉన్న, చల్లని ప్రాంగణంలో ఉండాలని సూచించారు. పగటిపూట ఇంటి ఎండ వైపున ఉన్న కిటికీలు, కర్టెన్లను మూసి ఉంచాలని, చల్లని గాలి లోపలికి వచ్చేలా రాత్రిపూట వాటిని తెరవాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లడం మానుకోవాలని, ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3గంటల వరకు బయటకు రాకుండా ఉండాలన్నారు.

## కెఆర్ఎంబికి ఎపి రాసిన లేఖపై తెలంగాణ ఇరిగేషన్ శాఖ మండిపాటు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** కృష్ణా జలాల వినియోగం విషయంలో కెఆర్ఎంబికి తాజాగా ఏపి నీటిపారుదలశాఖ రాసిన లేఖపై తెలంగాణ మండిపడుతోంది. కృష్ణలో కేటాయింపులకంటే ఎక్కువ జలాలను అక్రమంగా వాడుకోవడమే కాకుండా పైగా అసత్య ఆరోపణలతో ఫిర్యాదు చేయడంపై తెలంగాణ నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం, సాగర్‌లో నిల్వ ఉన్న జలాలను కేటాయింపులకంటే ఎక్కువగా వినియోగించుకుని.. వరద జలాలు అని పేర్కొనడం సరికాదంటున్నారు. కాగా.. జల విద్యుదుత్పత్తి కోసం గత ఏడాది నవంబరు 2 నుంచి 11 వరకు శ్రీశైలం నుంచి 28.86 టిఎంసిల నీటిని తెలంగాణ వృథా చేసిందని ఎపి ఇరిగేషన్‌శాఖ తాజాగా కెఆర్ఎంబికి లేఖ రాసింది. ఇకపై జలాలను వృథా చేయకుండా తెలంగాణ కోటాను తగ్గించాలని బోర్డును కోరింది. అదే సమయంలో కృష్ణలో గత ఏడాది 2343 టిఎంసిల వరద రాగా అందులో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజి వరకు తాము వాడుకున్నది 681.31 టిఎంసిలను వాడుకున్నామని, నవంబరు 1 వరకు వరద జలాల్లో 215.69 టిఎంసిలు వాడుకున్నామని ఎపి తెలిపింది. వరద రోజుల్లో వాడుకున్న నిటిని ఎపి ఖాతాలో వేయొద్దని ఆ రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు బోర్డును కోరారు. ప్రస్తుతం వాడుకున్న దానికి అదనంగా 73.50టిఎంసిల జలాలు కావాలని బోర్డుకు డిమాండ్ చేసింది. దీంతో ఎపి వైఖరిపై తెలంగాణ ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారు.

## అనిల్‌అంబానీ ఆస్తుల వివరాలపై హైదరాబాద్, ముంబయిలో ఇడి సోదాలు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ పవర్ అధినేత అనిల్ అంబాని ఆస్తుల వివరాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) శుక్రవారం నాడు హైదరాబాద్‌తో పాటు ముంబాయిలో పలు ప్రాంతాలలో సోదాలు చేబట్టింది. పలు బ్యా ంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని వాటిని తిరిగి చెల్లించక పోవడంతో అనిల్ అంబానిపై ఈడీ కేసు నమోదు చేయడం తెలిసిం దే. ఈ క్రమంలో అనిల్ అంబానికి చెందిన కొన్ని ఆస్తులను ఈడీ ఇప్పటికే జప్తు చేయడం తెలిసిందే. మరికొన్ని ఆస్తుల కోసం తాజాగా సోదాలు చేబట్టిన ఈడీ అధికారులు ఇందులో భాగంగా హైదరాబాద్‌లో అనిల్ అంబానికి చెందిన ఆస్తుల వివరాల సేకరించారు. హైదరాబాద్, ముంబాయిలో జరిగిన ఈ సోదాల్లో ఈడీ అధికారులు 3716 కోట్ల రూపాయల ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది. ఈ సోదాలు మరో రెండు రోజుల పాటు జరిగే వీలుందని తెలిసింది.

## షేక్‌పేట్ ఎస్‌సి గురుకులం ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన విజయేందిర బోయి శుక్రవారం షేక్‌పేట్‌లోని గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. షేక్‌పేటలో ఉన్న ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)ను సెక్రటరీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. తనిఖీ సందర్భంగా కార్యదర్శి 5వ తరగతి, 10వ తరగతిలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించారు. అక్కడ ఉన్న పరిశుభ్రత, నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిం చారు. పరిశుభ్రత, స్వచ్ఛతను ఎల్లప్పుడూ కచ్చితంగా పాటించాలని, శుభ్రత విషయంలో ఎటువంటి నిరక్ష్యం ఉండకూడదని సిబ్బందికి ఆదేశించారు. తర్వాత భోజనశాలను సందర్శించి, అక్కడ కూరగాయలను వేరు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, సరఫరా అయ్యే కూరగాయల్లో పాడైనవి ఉంటే ఏ చర్యలు తీసుకుంటారో తెలుసుకున్నారు. కూరగాయల సరఫరాలో నాణ్యతను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడాలని కార్యదర్శి ఆదేశించారు. అనంతరం నిల్వగది(స్టోర్ రూమ్)ని సందర్శించి గుడ్లు, పండ్లు, ఇతర ఆహార పదార్థాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. బియ్యం సంచులను గోడలకు ఆనించి ఉంచకూడదని సూచిస్తూ, వాటిని సరిగా నిల్వ చేయడానికి ప్రత్యేక స్టాండ్లు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## మహిళల సాధికారతకు కట్టుబడిన మోడీ సర్కారు: ఎంపి బన్సూరీ స్వరాజ్

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** మహిళల సాధికారతకు మోడి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపి బన్సూరీ స్వరాజ్ అన్నారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బన్సూరీ స్వరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, సీనియర్ నాయకురాలు బంగారు శృతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి బన్సూరీ స్వరాజ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి మాట్లాడుతూ మహిళ అంటే గౌరవం, అభిమానం అని భావించే ప్రతి ఒక్కరూ మహిళా దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని అన్నారు. మహిళలు బలంగా నిలబడితేనే కుటుంబం బలపడుతుందని, కుటుంబం బలపడితేనే సమాజం బలపడుతుందని ఆమె పేర్కొన్నారు.

# ఇందిరా మహిళాశక్తి బజార్‌లో హస్తకళల ప్రదర్శన ప్రారంభం

## చేతి వృత్తులను ప్రోత్సహించాలి : సినీనటి అమల అక్కినేని

## రేపు హస్తకళల ప్రదర్శనను సందర్శించనున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాజధాని నగరంలోని హైటెక్ సిటీ సమీ పంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఇండియా హ్యాండ్ మేడ్ కలెక్టివ్, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సంయుక్తంగా నిర్వహిస్తున్న హస్తకళల ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. చేతివృత్తిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం, హస్తకళలకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమాన్ని సినీనటి, ఎనిమల్ రైట్స్ కార్యకర్త అమల అక్కినేని, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టెక్స్టైల్ నిపుణులు, సిసిటి వ్యవస్థాపక సభ్యురాలు విజయలక్ష్మి నార్నే, వ్యవసాయ శాస్త్రవేత్త , సిఎస్ఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జి.వి. రామంజనేయులు ప్రారంభించారు. అనంతరం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌తోపాటు విక్రయాలతో కూడిన ప్రత్యేక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అమల అక్కినేని సాంప్రదాయ చేతివృత్తులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. భారతీయ సంప్రదాయాలకు ప్రతీకలైన చేతివృత్తులు మన సంస్కృతికి అద్దం పట్టేవని, వాటి పరిరక్షణ ప్రతీ ఒక్కరిబాధ్యత అని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలు తరతరాలుగా చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, యంత్రాల ఆధిపత్యం పెరగడంతో ఈ వృత్తులు క్రమంగా క్షీణిస్తున్నాయని తెలిపారు. చేతివృత్తుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పిస్తే కళాకారులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. యువత చేతివృత్తులవైపు ఆకర్షితులయ్యేలా శిక్షణ, ప్రోత్సాహకాలు అవసరమని సూచించారు.

అనంతరం సెర్ప్ సిఇఒ దివ్యదేవరాజన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి బజార్‌గా అభివృద్ధి చెందిన ఈ ప్రాంగణం ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురై వివాదాల్లో చిక్కుకుందని తెలిపారు.

ఈ స్థలాన్ని వేలం వేస్తే రూ.500 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క మహిళల సాధికారత కోసం దీన్ని మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ స్థలాన్ని గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సుమారు రూ.9 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు షాపులను ఉచితంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. కాగా... ఐహెచ్‌ఎంసి తెలంగాణ చాప్టర్‌లో చేతితో నేసిన వస్త్రాలు సహజ వర్ణాలతో తయారైన దుస్తులు, అలంకరణ వస్తువులు, సహజ ఫైబర్ కళాకృతులు, మట్టి ఆభరణాలు, లాకర్ బొమ్మలు, వంట సామగ్రి, సహజ పదార్థాలతో తయారైన చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ప్రత్యేక గిఫ్ట్ కాంబినేషన్లు అందుబాటులో ఉంచారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఈ బజార్‌ను సందర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద ఎత్తున మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరై తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మెగా మహిళా రైతు మేళా

## 8, 9 తేదీల్లో నిర్వహణ: విసి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ఈ నెల 8, 9 తేదీల్లో మెగా మహిళా రైతు మేళానునిర్వహిస్తున్నామని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. ఈ విషయమై శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్‌లోని విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న రైతు మేళాను విజయవంతం చేయాలని కోరారు. మహిళా రైతుల సాధికారిత లక్ష్యంగా నిర్వహించనున్న ఈ మేళకు సుమారు 8 నుంచి 10 వేల మంది మహిళా రైతులు హాజరవుతున్నారని వివరించారు. రెండు రోజుల మెగా మహిళా రైతు మేళాలో వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లు, వాటి పరిష్కారాలపై శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని సెర్ప్‌కు చెందిన సుమారు మూడు వేల మంది మహిళా రైతులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వివిధ ఆధునిక సాంకేతిక అంశాలపై సుమారు 70 నుంచి 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# పాలమూరు పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోకస్: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మార్చి 8న కీలక సమీక్షా సమావేశం జరగనుంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలో రాష్ట్ర సాగునీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష ప్రారంభమవుతుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ప్రాజెక్టుల వారీగా ఉన్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులను, జిల్లాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సాగునీటి పథకాలపై ఈ సమీక్షలో సమగ్రంగా చర్చించనున్నారు. ఎస్. జైపాల్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. వీటితోపాటు రాజీవ్ భీమా, జవహర్లాల్ నెహ్రూ ఎత్తిపోతల పథకాలు కోయిల్ సాగర్, ప్రియదర్శిని జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకోనున్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై కూడా ఈ సమావేశంలో స్పష్టత రానుంది. సమావేశానికి ఉమ్మడి జిల్లా ఇంచార్జ్‌మంత్రితో పాటు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో ఉన్న భూసేకరణ, పునరావాస సమస్యలపై పూర్తి వివరాలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి అదేశాలు జారీ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రాజెక్టులను త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా సమావేశం జరగనుంది. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదలశాఖ కార్యదర్శి ఈ శ్రీధర్, వివిధ శాఖల ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# పశుసంవర్ధక శాఖ ఎడి మృతి

## గొర్రెలు, మేకల పెంపకందారులు, గోపాల మిత్రలు సంతాపం

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్ మల్లేశ్వరి కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె శుక్రవారం ఉదయం 5.30గంటలకు హైదరాబాద్‌లో మృతి చెందారు. మల్లేశ్వరి గతంలో సుదీర్ఘకాలం విబిఆర్‌ఐలో జెడిగా సేవలం దించారు. ప్రస్తుతం రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్‌తోపాటు తెలంగాణ రాష్ట్ర పశు గణా భివృద్ధి సంస్థకు ఇన్‌ఛార్జ్ సి.ఇ.ఓగా కూడా వ్యవహరిస్తున్నారు. కాగా.. ఎడి మృతిపై గొర్రెలు, మేకల కాపర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీం దర్‌తోపాటు తెలంగాణ గోపాలమిత్రలు సంతాపం తెలిపారు. ఉన్న తాధికారి మల్లేశ్వరి మృతి రాష్ట్రంలోని గొర్రెల పెంపకందార్లకు, పాడి రైతులకు, పశువైద్య సిబ్బంది అధికారులకు తీరనిలోటని పేర్కొన్నారు.

# మొక్కజొన్న రైతుల పెండింగ్ బకాయి నిధులు విడుదల

## రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** మొక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిలను విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. మొక్కజొన్న రైతులకు చెల్లించేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.171 కోట్లు తాజాగా ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులను మార్క్‌ఫెడ్ ఖాతా నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి మార్క్‌ఫెడ్ 3.77 లక్షల టన్నుల మొక్కజొన్న రైతుల నుంచి సేకరించింది. దాదాపు 78,500 మంది రైతులు వీటిని విక్రయించారు. అయితే రైతులకు చెల్లించాల్సిన సొమ్ము ఇప్పటివరకు పెండింగ్‌లో ఉండగా విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలి దశలో మొక్కజొన్న రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.735.39 కోట్లు విడుదల చేసింది. అనంతరం ఇప్పుడు రూ.171 కోట్లు రిలీజ్ చేసింది. రైతులు సొమ్ము కోసం ఎప్పటినుంచో ఎదురుచూన్నారు. మొక్కజొన్నలు విక్రయించి నాలుగు నెలలు అయినా డబ్బులు రాకపోవడంతో రైతులు నిరాశ చెందారు. యాసంగి సీజన్‌కు పెట్టుబడి పెట్టుకోవడానికి నిధుల్లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తెచ్చుకుంటున్నారు. గతంలో పంట విక్రయించిన తర్వాత వారానికి ఒకసారి రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేవి. కానీ జనవరి 17 నుంచి నిధులు జమ కాలేదు. తాజాగా నిధుల విడుదలకు మోక్షం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సిఎం ప్రజావాణీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 383

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 6, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 383దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 108 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 39దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్లకోసం 153 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 83దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వాఫీసుల్లో ఫైళ్ల పరిష్కరణపై దృష్టి




మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో హైదరాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో మంత్రులు పొన్నం, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 6, ప్రభాతవార్త :** హైదరాబాద్ జిల్లాలో పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కరణ, ఆరోగ్యం, సురక్షితంగా చేరుకోవడం, భద్రత, సంక్షేమం, పిల్లల భద్రత, రక్షణ, డ్రగ్స్‌కి నో, ఇలా 99 రోజుల కార్యాచరణతో చేపట్టాల్సిన అంశాలపై శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో హైదరాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మం త్రులు పొన్నం ప్రభాకర్ చేపట్టిన సమీక్షా సమావేశంలో మంత్రి అజారుద్దీన్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమీషనర్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి జూన్ 12వరకు (99) రోజుల ప్రణాళికతో ముందుకు వెళుతున్నా మన్నారు.

ఈ ప్రణాళికలో ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించు కుంటామ న్నారు. 6వ తేదీ నుంచి మార్చి 15వరకు జీహెచ్ ఎంసీ పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వ కార్యాల యాల్లో ఫైళ్ల క్లియరెన్స్ చేయాలన్నారు. శుక్రవా రం హైదరాబాద్ జిల్లాలో ఈ వ్యర్థాల సేకరణ సెంటర్‌ను ప్రారం భించామన్నారు. ఏప్రిల్ 6 నుంచి 11 వరకు వైద్య ఆరోగ్య శాఖ తరుపున ఆరోగ్య పరిరక్షణ, మాతృశిశు సంరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రుల మెరుగైన వైద్య చికిత్సలు,జనన వ్యాధుల నివారణ కార్యాచరణ తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 22 నుంచి 28వరకు ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన ప్రత్యేక కార్యాచరణ,ఏప్రిల్ 28నుంచి మే2 వరకు పోలీసు డ్రగ్ నివారణకు చర్యలు చేపట్టనున్నా మన్నారు. మే4 నుంచి 9మధ్య వ్యవసాయం, రెవెన్యూ, విద్యుత్ అంశాలు ఉంటాయన్నారు.

మే 11నుంచి 16మధ్య విద్యాశాఖకు సంబంధించిన అంశాలు, ఇటీవల జరిగిన సర్వేలో కులం డబ్బు ఏది పని చేయదన్నారు. మే 18నుంచి 23 వరకు యువజన క్రీడల నిర్వహణ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ పాలసీ తీసు కొచ్చామన్నారు. క్రీడల నిర్వ హణ ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

# ఉపాధి హామీ పథకానికి సాంకేతిక ఆటంకాలు

## ఐరిశ్, ఫేస్ రికగ్నిషన్ నిబంధనలతో ఉపాధి సిబ్బంది, కూలీలకు ఇబ్బందులు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** అధునాతన సాఫ్ట్‌వేర్ అమలు, కొత్త సాంకేతిక నిబంధనలతో ఉపాధిహామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సాంకేతిక విధానం క్షేత్రస్థాయిలో కూలీల పాలిట శాపంగా మారింది. దీంతో పలు జిల్లాల్లో కూలీలకు ఉపాధి పని కరువవుతోంది. కూలీలు ఉదయం, సాయంత్రం పనులకు హాజరుకావాలని, రెండుపూటలా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలనే నిబంధనలతో ఇటు కూలీలు, అటు ఉపాధిహామీ సిబ్బంది పలు ఆటంకాలు ఎదుర్కొంటున్నారు. ఒక పని పూర్తైన తర్వాతనే మరో పనిని చేపట్టాలనే మార్గదర్శకాలతో ఉపాధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిత్యం చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని కేంద్రం ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలో సిగ్నల్స్ సరిగా లేక ఫొటోలు అప్‌లోడ్ కాక సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి అమ ల్లోకి వచ్చిన ఐరిస్ అటెండెన్స్ ప్రక్రియ ఆదిలోనే హంస పాదులా తయారైంది. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు ఐరిస్ నమోదు కాకపోవడంతో మండు టెండలో గంటల తరబడి నిరీక్షించి, చివరకు పని చేయకుండానే నిరాశతో వెను దిరుగుతున్నారు.

ఉపాధి హామీ నిబంధనల ప్రకారం పని ప్రారంభించే ముందు వ్యక్తిగత ఐరిస్ ఫొటో, పని ముగిసిన నాలుగు గంటల తర్వాత గ్రూప్ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఉదయం 7 గంటలకే పని ప్రదేశానికి చేరుకున్న కూలీలకు సాంకేతిక లోపాలు చుక్కలు చూపిస్తున్నాయి. మొబైల్ ఫోన్లలో ఐరిస్ స్కాన్ చేస్తున్నప్పుడు పదేపదే కాప్చర్ వర్కర్ ఫొటో అగైన్ అని ఎర్రర్ మెసేజ్ వస్తుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు ఎక్కువ కావడంతో కనీసం అధికారులు టెంటు సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదని మండల అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కేవలం ఐరిస్ సమస్యే కాకుండా,కేవైసీ అప్‌డేట్ కాలేదనే కారణంతో మరికొంతమంది పేర్లు మస్టర్లలో కనిపించడం లేదు. గతంలో పని చేసినా, ప్రస్తుతం పేర్లు నమోదు కాకపోవడంతో కూలీలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఫోటో కోసం గంటల సమయం పడుతుంటే పని ఎప్పుడు చేయాలి? ఒక రోజు కూలీ రాకపోతే మా బతుకులు ఎలా గడవాలి? అని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపాలను సాకుగా చూపి కూలీలకు ఉపాధి దూరం చేయడం సరికాదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్యలను పరిష్కరించాలని, లేదా సాఫ్ట్‌వేర్ పని చేయనిచోట మాన్యువల్ హాజరుతీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మోయలేని పనిభారం.. ఉన్నతాధికారులపై ఆగ్రహం

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధమవుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ అధికారుల(ఎఇఒ) పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యిలా మారింది. ఉన్నతాధికారుల తీరుతో వివక్షకు గురవుతున్నామని ఎఇఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల వేధింపులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా పోరు బాటకు సిద్ధం అవుతున్నట్టుగా ఏఈఓ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో ఏఈఓ లు ఉన్నతాధికారుల తీరుకు నిరసనగా జిల్లా వ్యవసాయ అధికారులకు నిరసన పత్రాలు అందజేశారు. రైతు భరోసా, రైతుబీమా, మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షలు, రైతు గుర్తింపు కార్డుల నమోదు, పంటల సర్వే మొదలగు 49 రకాల విధులు నిర్వర్తిస్తూ తలకు మించిన భారాన్ని మోస్తున్న తమకు క్షేత్ర స్థాయిలో సహాయకులను కేటాయించకుండా ఉన్నతాధికారులు ఇబ్బందిపెడుతున్నారని ఎఇఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపట్టి క్షేత్ర స్థాయిలో వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నిర్ణయించారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన డిజిటల్ పంట సర్వేలో భాగంగా రాష్ట్రంలో జియో రిఫరెన్స్ విలేజ్ మ్యాపులు ఉన్న 9,795 గ్రామాల్లో ఈ రబీ నుండి 100 పంట అమలు చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9,795 మంది వాలంటీర్ లను నియమించిన విషయం తెలిసిందే.

అయితే జియో రిఫరెన్స్ మ్యాపులు లేని సుమారు 20 లక్షల ఫామ్ ఫీల్డ్స్‌తో పాటుగా, కౌలు, యన్.డీ.ఎస్, సమస్యాత్మక భూములు, పట్టా లేకుండా రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న లక్షలాది ఎకరాల అటవీ హక్కు పత్రం కలిగి ఉన్న భూములను సైతం సర్వే చెయ్యాల్సి వస్తోంది. ఈ బాధ్యతలను మళ్ళీ ఏఈఓ ల భుజాలపైనే వ్యవసాయశాఖ వేసింది. ఏఈఓలు పంట సర్వే, ఫార్మర్స్ రిజిస్ట్రీలో రైతుల నమోదు, యూరియా యాప్‌లో రైతుల మొబైల్ నంబర్ అప్డేషన్ వంటి పనుల్లో బిజీగా ఉండగా వలంటీర్ లు పంట సర్వేలో భాగంగా తీసిన పంట పొలాల ఫోటోలను వెరిఫై చేసే బాధ్యతను కూడా వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారుల (ఎవో)కు అప్పజెప్పింది. మండల వ్యవసాయ అధికారులు తమ ఉద్యోగ సంఘాల అధికారం, ధన మరియు రాజకీయ బలంతో ప్రభుత్వం తమకు అప్పజెప్పిన పంటల ఫోటో వెరిఫికేషన్ బాధ్యతలను రాష్ట్ర స్థాయిలో పైరవీ చేసి ఆ భారాన్ని కూడా ఏఈఓల పైకే బదిలీ చేయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓలు భగ్గుమంటున్నారు. వ్యవసాయశాఖలో 49 రకాల పనుల భారం మోస్తూ శాఖకు వెన్నెముకగా నిలుస్తున్న ఏఈఓలపై ఇకనైనా పనిభారం తగ్గించాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను ఎఇఒల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# యుద్ధం ప్రభావంతో పౌల్ట్రీ రైతు కుదేలు

## నిలిచిపోయిన ఎగుమతులు.. పడిపోయిన గుడ్డు ధరలు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** అమెరికా-ఇజ్రాయెల్‌కు ఇరాన్ మధ్యకొనసాగుతున్న యుద్ధం రాష్ట్రంలోని పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తు న్నాయి. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ (మధ్య ప్రాచ్యం) దేశాలకు జరిగే ఎగుమతులు పూర్తిగా నిలిచిపోవడంతో, దేశీయంగా కోడిగుడ్ల నిల్వలు భారీగా పేరుకుపోయాయి. దీని ప్రభావంతో గుడ్ల ధరలు దారుణంగా పడిపోయి, పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. ఈ సంక్షోభం కారణంగా పౌల్ట్రీ రంగానికి రోజుకు సుమారు రూ. 5 కోట్ల మేర నష్టం వాటిల్లు తున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా ఎగుమతులు సాఫీగా సాగే సమయంలో గుడ్డు ధర ఆశాజనకంగా ఉంటుంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఒక్కో గుడ్డు ధరను రూ. 4.30గా నిర్ణయిం చినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. డిమాండ్ లేకపోవడంతో స్థానిక మార్కెట్లలో ఒక్కో గుడ్డు కేవలం రూ. 3.50 మాత్రమే పలుకుతోంది. కొన్ని ప్రాంతాల్లో ధర ఇంతకంటే తక్కువగా ఉండటంతో ఉత్పత్తి వ్యయం కూడా రాక రైతులు లబోదిబోమంటున్నారు. యుద్ధ మేఘాలు త్వరగా తొలగిపోకపోతే, రానున్న రోజుల్లో ఎగుమతులు మరింతగా దెబ్బతిని ధరలు ఇంకా పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వేసవి కాలం సమీపిస్తుండటం, గుడ్ల వినియోగం కాస్త తగ్గే అవకాశం ఉంది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీ యజమానుల్లో ఆందోళన పెరుగుతుంది. ప్రభుత్వం స్పందించి ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, తమను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పౌల్ట్రీరంగానికి చెందిన ప్రముఖులు కోరుతున్నారు.

# నిధుల్లో నిర్లక్ష్యం.. పిడి ఖాతాలు క్లోజ్

## అనవసర వ్యయానికి చెక్

## రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని తన దైన శైలిలో ముందుకు వెళుతుండగా, కొన్ని శాఖల వ్యవహారం తలనొప్పిగా తయారయింది. నిధులు, వడ్డీల ఖర్చులో వివిధ శాఖాధిపతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం గుడ్ బై చెప్పింది. నిధుల వినియోగంలో పారదర్శకతను నిర్ధారించడానికి, శాఖాధిపతుల అనవసర వ్యయాన్ని అరికట్టడానికి, ప్రతి పైసా రాష్ట్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ఖర్చు అయ్యేలా పీడీ ఖాతాలకు స్వస్తి పలకాలని నిర్ణయిం చింది. ఈ మేరకు, ఆర్థిక శాఖ తాజాగా ఇతర ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మార్చి 31 నాటికి పీడీ ఖాతాలను మూసివేయాలని, ఆయా ఖాతాల్లో నిల్వ చేసిన నిధుల వివరాలను మొత్తంతో సహా లెక్కించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ శాఖల ఆర్థిక లావాదేవీలన్నీ 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుండి ఆర్థిక శాఖ ద్వారానే కొనసాగాలని కూడా సూచించింది. కాగా కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ శాఖలు, సంస్థలకు అందే నిధులను సాధారణంగా పీడీ ఖాతాలో జమ చేస్తారు. ఈ నిధిని ఆ శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, ఇతర అవసరాలకు శాఖాధిపతి నిర్ణయం ప్రకారం ఖర్చు చేస్తారు. అయితే కొన్ని శాఖలలో పీడీ ఖాతాలలో నిధుల నిరక్ష్యంగా ఖర్చు చేయడాన్ని ప్రభుత్వం గుర్తించింది. కొంతమంది శాఖాధిపతులు పీడీ ఖాతాల్లో ఉన్న సొమ్ముకు సంబంధించిన వడ్డీ నిధులను వృధాగా ఖర్చు చేస్తున్నట్లు సర్కార్ దృష్టికి వచ్చింది.

ఇదే సమయంలో సెక్రటేరియట్‌లోని ప్రభుత్వ కార్యదర్శులకు సైతం సమాచారం ఇవ్వకుండా మరికొన్ని విభాగాలు నిధులను ఉపయోగిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ప్రధానంగా సంక్షేమ శాఖలు మరియు ఆయా శాఖల పరిధిలోని కార్పొరేషన్ల పీడీ ఖాతాలలో పెద్ద మొత్తంలో నిధులు ఉన్నట్లు తెలిసింది. సంక్షేమ భవన్‌లోని ఒక కార్పొరేషన్‌కు చెందిన ఒక అధికారి పీడీ ఖాతాలో నిధులు, వాటికి సంబంధించిన వడ్డీ మొత్తం నుండి అదనపు ఖర్చులు చేస్తున్నట్లు ఆర్థిక శాఖకు ఫిర్యాదులు అందాయి. అదేవిధంగా వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న కార్పొరేషన్ల అధికారులు కూడా అదనపు ఖర్చులకు నిధులు వినియోగిస్తున్న తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విధంగా పలు ప్రభుత్వ శాఖల పీడీ ఖాతాలలో పెద్ద మొత్తంలో నిధులు ఉన్నందున, ఆ నిధిపై భారీ వడ్డీ జమ అవుతోంది. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన పీడీ ఖాతాల్లో దాదాపు రూ.5,400 కోట్లకు పైగా నిధులు ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఈ పీడీ ఖాతాలను రద్దు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో, ఈ నిధులన్నీ సర్కార్ ఖజానాకు జమ అవుతాయి. ప్రస్తుతం నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నిధులు భారీ ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నట్లు ఆర్థిక శాఖ అధికవారవర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఇకపై పీడీ ఖాతాల్లోని నిధులను ఎలాంటి ఖర్చు చేయవద్దని, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా జరిగే ఏదైనా ఖర్చుకు ఆ శాఖ అధిపతి బాధ్యత వహించాలని ప్రభుత్వం ఆయా విభాగాలు, సంస్థలకు సూచించినట్లు సమాచారం.

# మార్కెట్ మాయాజాలానికి బలవుతున్న వేరుశనగ రైతులు

## కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయని వ్యాపారులు

## సిండికేట్‌గా మారి రైతుల నిలువుదోపిడీ

## మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అన్నదాతల డిమాండ్

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టపడి వేరుశనగ రైతులకు మద్దతు ధర రావడం లేదు. రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం తదితర జిల్లాల్లో కొద్దిమేర సాగవుతోంది. అయితే వేరుశనగ విస్తీర్ణం తగ్గినా, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నా వ్యాపారుల మాయాజాలం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని ఏ వ్యవసాయ మార్కెట్లో మద్దతు ధర రావడం లేదు. మార్కెట్‌కు రైతులు అమ్మకానికి తీసుకువస్తే వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. మార్కెట్‌కు తీసుకువచ్చిన వేరుశనగకు ధర రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ కావడంతో రైతులు నష్టపోతున్నారు. మార్కుఫెడ్ ద్వారా మక్కలు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వేరుశనగకు క్వింటాలుకు 7263 రూపాయల మద్దతు ధర నిర్ణయించింది. అయితే ఈ ధర రైతులకు అందడం లేదు. మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగకు రూ.500 నుంచి రూ.700 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం మాత్రం లేదని వాపోతున్నారు. మద్దతు ధర ఉన్న వ్యాపారులు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, కొద్దిమంది రైతులకు మద్దతు ధర ఇస్తూ మిగతా వేరుశనగ రైతుల వద్ద ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరకు మించి ధర పెట్టి కొనుగోలు చేయాల్సి ఉన్నా వ్యాపారులు మాత్రం పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. ప్రధానంగా వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో వేరుశనగ కొనుగోలు చేసే వ్యాపారులు సిండికేట్ కావడం వల్ల ధర రావడం లేదు. మార్కెట్ కు ప్రతిరోజు వేరుశనగను రైతులు తీసుకువస్తున్నారు. ఈ వ్యాపారులు కొనుగోలు చేస్తూ ధర మాత్రం పెట్టడం లేదు. ప్రతీరోజు మార్కెట్ కు వచ్చే వేరు శనగను పరిశీలిస్తున్నారు. ఒకరు లేదా ఇద్దరు రైతులకు సంబంధించి మద్దతు ధరకు మించి క్వింటాలు రూ.8 వేల నుంచి రూ.10 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. మిగతా రైతులంతా క్వింటాలు రూ.6500 నుంచి రూ.7 వేల మధ్యనే కొంటున్నారు. కొంత మంది రైతులది తేమ ఉందని క్వింటాలు రూ.5 వేల నుంచి రూ.6500 మధ్యనే కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్‌కు తెచ్చిన రైతులు మళ్లీ తిరిగి తీసుకొని వెళ్లలేక వచ్చిన ధరకు అమ్మకాలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో పల్లి ధర క్వింటాలు రూ.10వేల వరకు పలుకుతున్నా వరంగల్ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో ధర రావడం లేదు. కేసముద్రం, మహబూబాబాద్‌తో పాటు ఇతర మార్కెట్లో ఎక్కువ ధరలు వస్తున్నా ఎనుమాముల మార్కెట్‌లో మాత్రం రావడం లేదు. ఈ అన్యాయంపై వేరు శనగ తీసుకొచ్చిన రైతులు అధికారులతో పాటు ప్రజాప్రతి నిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అయితే మార్కు ఫెడ్ ద్వారా వేరుశనగ కొనుగోలుకు ఆదేశాలు రాలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

**అచ్చంపేటలో రైతుల నిరసన..**

వేరుశనగకు గిట్టుబాటు ధర కలినపంచాలని అచ్చంపేట రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో బైఠాయించి రాస్తారొకొ చేపట్టారు. 301 మంది రైతులు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ తీసుకొచ్చారు. మొదటిరకం వేరుశనగకు రూ. 9147, మధ్యరకం క్వింటాల్‌కు రూ.7179, మూడో రకం క్వింటాల్‌కు రూ.5009గా ధర నిర్ణయించారని వెల్లడించారు. అయితే 20 రోజుల క్రితం వరకు సుమారు 14వేలు పలికి ధర ఇప్పుడు ఏకంగా 9వేలకు పడిపోవడంపై అధికారులను రైతులు నిలదీశారు. అధికారులు స్పందించకపోవడంతో నిరసనకు దిగారు.

## సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో సత్తా చాటిన అభ్యర్థులకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి6:** యుపిఎస్‌సీ సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.యుపిఎస్‌సి ఫైనల్స్ ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు సెలెక్ట్ అయ్యారు. వీరిలో 20 మంది సివిల్స్ తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలిచారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

## కెసిఆర్‌ను కలిసిన బాల్క సుమన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి6:** మాజీ సిఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా అరెస్టై జైలుకు వెళ్లి వెళ్లిన బాల్క సుమన్ విడుదలయ్యారు. శుక్రవారం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



## విహెచ్‌తో వేం నరేందర్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి6:** కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానం కోసం వీహెచ్ తీవ్రంగా ప్రయత్నించగా.. కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం చివరికి వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో వీహెచ్ ఇంటికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డిని వీహెచ్ శాలువాతో సత్కరించారు. అనంతరం వారిద్దరూ దాదాపు 2 గంటలపాటు ఏకాంతంగా చర్చలు జరిపారు. తనకు ఎంపీ సీటు ఇవ్వకపోవడంపై వీహెచ్ అలకబూనినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ని వేం నరేందర్‌రెడ్డి బుజ్జగించినట్లు సమాచారం. నాకేం బాధ లేదు, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని విహెచ్ స్పష్టం చేశారు.

## డిజిటల్ మోసాల్లో 85% వరకూ పరిహారం

### అమల్లోకి రానున్న ఆర్‌బిఐ కొత్త మార్గదర్శకాలు

**ముంబయి, మార్చి 6:** డిజిటల్ మోసాలు బారిన పడి డబ్బులు కోల్పోయిన బ్యాంక్ కస్టమర్లకు ఊరటనిచ్చేలా భారత రిజర్వుబ్యాంకు సరికొత్త ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, బాధితులు కోల్పోయిన మొత్తంలో 85 శాతం వరకు లేదా గరిష్టంగా రూ.25 వేలు పరిహారంగా పొందే అవకాశం ఉంది. చిన్న తరహా డిజిటల్ మోసాల్లో కస్టమర్లు కోల్పోయిన నెట్ లాస్‌లో 85 వరకు పరిహారం అందుతుంది. అయితే ఈ పరిహారం గరిష్టంగా రూ.25వేలు కు మాత్రమే పరిమితం చేసింది. సుమారుగా రూ.50వేల లోపు జరిగే డిజిటల్ లావాదేవీల మోసాలకు ఇది వర్తిస్తుంది. దాదాపు 65 ఆన్‌లైన్ ఫ్రాడ్స్ ఈ కేటగిరిలోనే ఉంటున్నాయని ఆర్‌బిఐగుర్తించింది. ఈ ప్రయోజనాన్ని ఒక కస్టమర్ తన జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే పొందగలరు. మోసం జరిగిన 5 రోజులలోపు బ్యాంక్‌కు , నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ (1930) కు ఫిర్యాదు చేయాలి. కస్టమర్ పొరపాటున ఒటిపి లేదా పాస్‌వర్డ్ షేర్ చేసిన సందర్భాల్లో కూడా కొన్ని షరతులతో ఈ పరిహారం వర్తిస్తుంది. ఈ పరిహార మొత్తాన్ని ఆర్‌బిఐ వద్ద ఉన్న డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ నుండి చెల్లిస్తారు. ఇందులో ఆర్‌బిఐ వాటా 65 ఉండగా, సంబంధిత బ్యాంకులు మిగిలిన మొత్తాన్ని భరిస్తాయి. నిబంధనలు జూలై 1 నుండి అమల్లోకి వస్తాయనిఅంచనా. ప్రస్తుతానికి ఇవి ముసాయిదా దశలో ఉన్నాయి, ప్రజలు , స్టేక్ హోల్డర్స్ ఏప్రిల్ 6, 2026 వరకు తమ అభిప్రాయాలను తెలపవచ్చు. ఒకవేళ మోసం అనేది బ్యాంక్ వైఫల్యం వల్ల లేదా థర్డ్ పార్టీ బ్రీచ్ వల్ల జరిగితే అప్పుడు కస్టమర్‌కు పూర్తి రీఫండ్ లభిస్తుంది. బ్యాంక్ వైపు నుంచి భద్రతా లోపాలు ఉన్నట్లు తేలితే దానికి బ్యాంకే బాధ్యత వహించాలి.



కళాకారుల 'ధూం ధాం'లో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, డాక్టర్ ర్యాగ రుషి అరుణ్‌కుమార్, నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య తదితరులు

## కళాకారులకు ఉద్యోగాలు వచ్చేదాకా కృషి

### సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ శక్తియుక్తులను ధారపోసి కోట్లాది మంది ప్రజల హృద యాల లో చైతన్యం తీసుకువచ్చిన కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిం చేంత వరకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడగా సిఎం సానుకూలంగా స్పందించి, మూడు, నాలుగు రోజుల్లో వివరంగా చర్చించనున్నారని ఆయన తెలిపారు. బిసి కళామండలి జాతీయ అధ్యక్షుడు రామలింగం అధ్యక్షతన శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ధూం ధామ్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగిం చారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కెసిఆర్ సిఎంగా పదేళ్లపాటు ఉన్న ప్పుడు కళాకారుల గురించి పట్టించుకోలేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారుల ఉద్యోగాలు, ఇతర సమస్యలపై సానుకూలంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఒక్క కెసిఆర్ వల్ల రాలేదని కళాకారుల పాట లు, ఆటలు ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగి ప్రజలంతా ఉద్యమించడంతో తెలంగాణ రాష్ట్ర వచ్చిందని తెలిపారు. కళాకారుల పాటల ద్వారానే ఆనేక దేశాల్లో ప్రజల్లో చైతన్యం వచ్చి విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కళాకారులు కిరణ్, ఎ. వెంకటేష్, డప్పు స్వామి, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, ఎం.డి.అహ్మాద్, పరాకాల రమ, శ్రీకాంత్, బిసి నేతలు నీల వెంకటేష్, గుజ్జ సత్యం, జి.అనంతయ్య, సి.రాజేందర్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తైన కొండల్లో.. అసోం తెగ ప్రజలతో..

### ఆర్మీ చాపర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ పర్యటన

### హాఫ్లాంగ్, సంప్రదీసా గ్రామాల్లోని అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

### అసోం రైఫిల్స్‌లో చేరిన సైనికుల ప్రమాణోత్సవంలో నేడు ప్రసంగం



**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రెండో రోజు శుక్రవారం అసోం రాష్ట్రంలోనే ఎత్తైన కొండ ప్రాంతమైన దిమా హసావో జిల్లాలోని హాఫ్లాంగ్ ప్రాంతంలోలో పర్యటించారు. ఉదయం 9.30 గంటలకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన మిగ్ 17 చాపర్‌లో గౌహతి నుంచి బయలు దేరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తొలుత హాఫ్లాంగ్‌కు చేరుకున్నారు. అక్కడ అటానమస్ కౌన్సిల్ సభ్యులతోపాటు వివిధ శాఖల అధికారులు, సివిల్ సొసైటీ నాయకులతో సమావేశమయ్యారు. విద్య, వైద్యం, రోడ్లు, లా అండ్ ఆర్డర్, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వారి నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలుత పిఎంశ్రీ నిధులతో నడుస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పిఎంశ్రీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మిడ్ డే మిల్స్ సెక్షన్, కిచెన్ గార్డెన్, స్మార్ట్ రూంలను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. స్కూల్లో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి స్టేడియంకు వెళ్లారు. దాదాపు రూ.16.5 కోట్లతో చేపట్టిన స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సివిల్ ఆసుపత్రికి వెళ్లి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం హాఫ్లాంగ్ నుండి నేరుగా రోడ్డు ప్రయాణంలో అత్యంత ఎత్తైన కొండపైనున్న సమ్‌ప్రదీసా అనే మారుమూల గ్రామానికి బయలు దేరారు. సముద్ర మట్టానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం నుంచి ప్రయాణించడం కష్టసాధ్యమైంది. కొట్టుకుపోయిన రోడ్లు, ఆ రోడ్డుకు ఒకవైపు కొండ చరియలు, మరోవైపు లోయ, సంక్లిష్టమైన ప్రయాణం అయినప్పటికీ అవేవీ లెక్క చేయకుండా సమ్ ప్రదీసా గ్రామానికి వెళ్లారు. కేంద్ర మంత్రి రాకను పురస్కరించుకుని అక్కడి తెగ ప్రజలు సాంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పళ్లతో స్వాగతం పలికారు. కేంద్ర నిధులతో ఆ గ్రామంలో చేపట్టిన అంగన్ వాడీ సెంటర్, స్కూల్, హెల్త్ సబ్ సెంటర్, జల్ జీవన్ మిషన్, పిఎం ఆవాస్ యోజన పథకంతో నిర్మించిన ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ముఖ్యం గా ఆ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేదనే విషయాన్ని గ్రహించిన కేంద్ర మంత్రి రోడ్డు నిర్మాణం పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. శనివారం ఉదయం అసోం రైఫిల్స్‌లో నూతనంగా చేరిన సైనికుల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

## అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీస్‌రోడ్డు నిర్మాణంలో సమస్యలను పరిష్కరించండి

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రత్యేక శ్రద్ధను కలిగి ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు నిర్మాణంలో సమస్యలను పరిష్కరించాలని, ఈమేరకు సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి బహిరంగం లేఖ రాసారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశలలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలకు 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ. 265 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్163 (గతంలో ఎన్‌హెచ్ 202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల ఫ్లై ఓవర్‌ను నిర్మించిందన్నారు.తాను సైతం జిహెచ్‌ఎంసి కమీషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, సమస్య ఒక కొలిక్కి రాలేదు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్ధిదారునికి ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో మీరు వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జిహెచ్‌ఎంసి/ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

## మోడీ నాయకత్వంలో మహిళలకు అపారగౌరవం, అవకాశాలు

### బిజెపి కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవాలు

### పాల్గొన్న రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని మహిళలకు అపార గౌరవం, అవకాశాలు లభిస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో విశిష్ట అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ఎంపి బన్సూరీ స్వరాజ్, ముఖ్య అతిథిగా హాజరుకాగా, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాం చందర్‌రావు మాట్లాడుతూ నారీ శక్తి అనే భావన కేవలం బిజెపి నినాదమే కాదు, దేశ నిర్మాణానికి సంబంధించిన ఒక జాతీయ మిషన్ అన్నారు. ఒకప్పుడు దేశంలో ఆడబిడ్డ పుట్టడాన్ని నిర్లక్ష్యంగా చూసే పరిస్థితులు ఉండేవని, ఆడ శిశువులను గర్భంలోనే హతమార్చే దారుణ పరిస్థితులు కూడా చోటుచేసుకున్నాయి. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్యమరీతిలో ప్రారంభించిన భేటీ బచావో, బేటీ పఢావో పథకం సమాజంలో పెద్ద మార్పు వచ్చిందన్నారు. నేడు ఆడబిడ్డలను కాపాడడమే కాకుండా వారికి విద్య, సాధికారత కల్పించే దిశగా దేశం ముందుకు సాగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం మహిళల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని,



## 5 వేల మంది ఉద్యోగుల వేతనాలకు బ్రేక్

### వివరాలు ఆన్‌లైన్ చేయపోవడంతో చర్యలు

### మార్చి జీతాలు నిలిపివేసిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఐఎఫ్‌ఎంఐఎస్)లో తమ వివరాలను మ్యాపింగ్ చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహారించిన రాష్ట్రంలోని సుమారు 5వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల మార్చి నెల జీతాలను ఆర్థిక శాఖ నిలిపివేసింది. కొంతకాలంగా ప్రభుత్వం ఉద్యో గులు అందరూ తమ వివరాలను మ్యాపింగ్ చేసు కోవాలని ఆర్థిక శాఖ సూచిస్తూ వస్తోంది. దీనికి సంబంధించి అన్నిశాఖలకు ప్రత్యేకంగా సర్క్యులర్లు జారీ చేసింది. వివరాలు నమోదు చేయకుంటే జీతాలు నిలుపుదల చేస్తామని హెచ్చ రించింది. అయినా కొందరు ఉద్యోగులు తమ వివరాలు ఇవ్వకపోవటంతో వారి జీతాలను నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. ఈ జాబితాలో రాష్ట్రం నుండి జిల్లా స్థాయి ఉద్యోగుల వరకు ఉన్నారు. కాగా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారిలో పెద్ద సంఖ్యలో బోగస్ ఉద్యోగులు ఉన్న ట్లు ప్రభుత్వం అనుమానిస్తోంది. దీంతో పనిచేయ కుండానే జీతాలు పొందుతున్న ఉద్యోగుల ఏరివేతే లక్ష్యంగా ప్రతి ఉద్యోగిని ట్రాక్ చేసేందుకు డేటా మ్యాపింగ్‌ను తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ ఉద్యోగుల్లోనూ చాలా మంది తమ వివరాలను ఐఎఫ్‌ఎంఐఎస్‌లో నమోదు చేసుకోలేదు.ఈ వివరాల నమోదు కోసం ప్రభుత్వం పలుమార్లు సమాచారం ఇచ్చింది. అయినా ఆధార్ అనుసంధానం కాకపోవడం, ఐడీ కార్డులో ఉన్న వివరాలకు, ఆధార్‌లో ఉన్న వివరాలకు పొంతన లేకపోవడం వంటి కారణాలతో ఉద్యోగుల వేతనాలు నిలిచిపోయాయి. తన వేతనం నిలిచిపోయిందని గుర్తించిన ఓ ఐఏఎస్ అధికారి వెంటనే ఆన్‌లైన్ పోర్టల్‌లో తన వివరాలను నమోదు చేసుకోగా, మిగిలిన ఉద్యోగులు కూడా ఇప్పుడు హుటాహుటిన డేటా మ్యాపింగ్ చేసే పనిలో పడ్డారు. పురపాలక శాఖలో పారిశుద్ధ్య కార్మికుల పేరుతోనూ, ఉన్నతాధికారుల డ్రైవర్లుగా, మంత్రులు, అధికారుల ఇళ్లలో వంట వాళ్లుగా చూపే వారిలోనే ఎక్కువ మంది బోగస్ ఉద్యోగులున్నట్లుఅనుమానిస్తున్నారు.

## సివిల్స్ ఫలితాల్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

### ఇద్దరు ఐపిఎస్‌కు సెలెక్ట్ అయ్యే అవకాశం

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) శుక్రవారం ప్రకటించిన సివిల్స్-2025 ఫలితాల్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ చూపారు. సివిల్స్-2025 తుది ఫలితాల్లో ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దళిత వర్గాల యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన ఏ ఆశిష్ దేశవ్యాప్తంగా ఆలిండియా 676 ర్యాంక్ సాధించగా, ములుగు జిల్లాకు చెందిన డి ప్రవీణ్ కుమార్ ఆలిండియా 793 ర్యాంక్ సాధించారు. వీరికి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) పొందే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. గత సంవత్సరం మే నెలలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన 27 మంది విద్యార్థులు అర్హత సాధించి, ఆగస్టులో జరిగిన మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని వారిలో 7 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు అర్హత సాధించగా, చివరకు ఇద్దరు తుది ఎంపిక సాధించడం గర్వకారణమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇటీవల ప్రకటించిన తెలంగాణ గ్రూప్-1 ఫలితాల్లో కూడా తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులు దాదాపు 33 ర్యాంకులు సాధించడం సంస్థ శిక్షణ నాణ్యతకు నిదర్శనమని మంత్రి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... దళిత వర్గాలైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉన్నత స్థాయి శిక్షణ అందించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కువ మంది ఎంపిక కావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన నిధులు, సదుపాయాలను సమయానికి అందిస్తూ అన్ని విధాలా సహకరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## తీవ్ర వ్యాధులను సాధారణ బలహీనతగా వర్గీకరించలేం

### సింగరేణి ఉద్యోగుల వైద్య వర్గీకరణపై హైకోర్టు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** జాతీయ బొగ్గు వేతన ఒప్పందం కింద కార్మికుల ఉపాధి ప్రయోజనాలను తిరస్కరించడానికి, వైద్యపరమైన కారణాల వల్ల గాయం, వ్యాధి, శరీర భాగాన్ని (కాలు/చేయి) తొలగిం చడం, స్ట్రోక్ సంబంధిత పక్షవాతం, వెన్నెముక గాయాలు, కోలుకోలేని దృష్టి నష్టం వంటి తీవ్రమైన, గుర్తించదగిన వైద్య పరిస్థితులను సాధారణ శారీరక బలహీనత గా వర్గీకరించలేమని హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల ప్యానెల్ అభిప్రాయపడింది. సింగరేణి కాలరీస్ దాఖలు చేసిన అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ బిలీ మొహియుద్దీన్‌లతో కూడిన ప్యానెల్ ఈ తీర్పును వెలువరించింది. వేతన ఒప్పందంలోని క్లాజ్ 9.4.0 ప్రకారం డిపెండెంట్ ఉద్యోగం కోరుకునే ఉద్యోగుల వైద్య వర్గీకరణను పునఃపరిశీలించాలని ఆదేశించిన సింగిల్ జడ్జి ఆదేశాలను సింగరేణి హైకోర్టులో సవాలు చేసింది. మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లోని మెడికల్ బోర్డు 127 మంది ఉద్యోగులను పరీక్షించి, ఆరుగురిని మాత్రమే శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నట్లు వర్గీకరిం చడంతో, మిగిలిన కార్మికులను సాధారణ శారీరక బలహీనత కింద ఉంచి, వారిపై ఆధారపడిన ఉద్యోగానికి అర్హతను పరిమితం చేసింది. దీనిపై వివాదం తలెత్తి పలువురు కార్మికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సింగరేణి అప్పీళ్లను పరిశీలిస్తున్నప్పుడు, వేతన ఒప్పందం గాయం లేదా వ్యాధి వల్ల కలిగే శాశ్వత వైకల్యం, సాధారణీకరించిన శారీరక బలహీనత మధ్య తేడాను స్పష్టంగా చూపుతుందని కోర్టు గమనించింది.

అనేక కేసులలో విచ్ఛేదనం, హెమిపరేసిస్‌తో స్ట్రోక్, క్వాడ్రిపరేసిస్‌తో గర్భాశయ వెన్నెముక గాయం మరియు కోలుకోలేని ఆప్టిక్ నరాల నష్టం వంటి తీవ్రమైన వైకల్యాలు ఉన్నాయనేది నిర్ధారణ చేసింది. ఇటువంటి పరిస్థి తులను సాధారణ బలహీనతగా పరిగణించలేమని, గని కార్మికులకు సామాజిక భద్రత కల్పించ డానికి ఉద్దేశించిన సంక్షేమ పథకం ఉద్దేశా న్ని దెబ్బతీస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉద్యోగులను వర్గీకరించే బాధ్యత అంతిమంగా యజమానిదేనని, అయితే వైద్య బోర్డు వైకల్యం యొక్క స్వభావం, పరిధికి సంబంధించి వైద్య అభిప్రాయాన్ని మాత్రమే అందిస్తుందని స్పష్టం చేసింది. అందువల్ల వర్గీకరణ ప్రక్రియలో సాధారణ బలహీనతను యాంత్రికంగా వర్తింప జేయడం కంటే వైద్య ఫలితాల ఆధారంగా నిర్మాణాత్మక, హేతుబద్ధమైన అంచనా ఉండాలని కోర్టు పేర్కొంది. ప్రతి కేసు యొక్క న్యాయమైన మరియు వ్యక్తిగతీకరించిన మూల్యాంకనాన్ని నిర్ధారిస్తూ, సక్రమంగా ఏర్పాటు చేయబడిన కమిటీ ద్వారా వర్గీకరణ ప్రక్రియను కొత్తగా చేపట్టాలని ఆదేశించింది.

## రూ.300కి చేరుకున్న చికెన్ రేటు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో చికెన్ ధరలు కొండెక్కాయి. మొన్నటివరకు కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.260 వరకు పలకగా, ఇప్పుడు ఒకేసారి రూ.300కి చేరుకుంది. పలు ప్రాంతాల్లో రూ.310కి కూడా చేరుకుంది. ధరలు ఒకేసారి పెరగడంతో కొనుగోలుదారులపై భారం పెరుగుతోంది. చికెన్ ధరలు ఒకేసారి పెరుగుదల కొద్ది రోజుల క్రితం కిలో లైవ్ బ్రాయిలర్ కోడి రూ.128గా ఉండగా, కిలో చికెన్ రూ.200కి పైగా ఉండేది. ప్రస్తుతం లైవ్ కోడి రూ.167గా ఉండగా డ్రస్డ్ చికెన్ రూ.280 నుంచి రూ.290 వద్ద ఉంది. ఇక స్కిన్ లెస్ చికెన్ రూ.300 నుంచి రూ.310 వరకు ఉంటుంది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

## మావోయిస్టు అగ్రనేత గణపతి జనజీవన స్రవంతిలో కలవాలి

### మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు వినతి

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి వెంటనే జనజీవన స్రవంతిలో కలవాలని మాజీ ఎంఎల్ఎ గోనె ప్రకాష్‌రావు కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 77 యేళ్ల గణపతి తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఈ పరిస్థితుల్లో ఆయన తుపాకి వదిలి శాంతిమార్గంలోకి రావాలని గోనె ప్రకాష్‌రావు విజ్ఞప్తి చేశారు. గణపతి కుమారుడు శ్రీనివాస్ (వాసు) పంపిన వాయిస్ మెసేజ్‌ను ఆయన అనుమతి లేకుండా మీడియాకు షేర్ చేసినందుకు ప్రకాష్‌రావు క్షమాపణలు కోరారు. ఇది కేవలం గణపతి లొంగుబాటుపై వున్న ఉత్కంఠ వల్ల జరిగిన పొరపాటుగా ఆయన తెలిపారు.

## బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

### నిందితుడికి మూడేళ్ల జైలు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు ఐదువేల రూపాయల జరిమా నా విధిస్తూ నాంపల్లి 12వ అదనపు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. వివరాలు ఇలావున్నాయి. గోషామహల్ పరిధిలోని బస్తీలో వుండే పదేళ్ల బాలిక ను చిరు వ్యాపారి మహమ్మద్ అయూబ్ అలియాస్ అవైస్ (34) 2023 డిసెంబరు 14 తేదీన సమీపంలోని మొబైల్ వాష్ రూంలో బలవంతంగా తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక కేకలు వేసి బయటకు పారిపోగా సమీపంలోని మహిళలు గమనించి బాలికను రక్షించి, వెంటనే పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. అ యూబ్ పారిపోగా పోలీసులు కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు. అనంతరం ఫోక్సో చట్టం కింద కేసు నమో దు చేసి నిందితుడిని జైలుకు తరలించారు. ఈ కేసులో మహిళా భద్రతా విభాగం పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచా రించిన నాంపల్లి 12వ అదనపు సెషన్స్ జడ్జి అనిత నిందితుడు అయూబ్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిం చారు. ఈ కేసులో పోలీసు శాఖ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాంరెడ్డి వాదించారు. పోలీసుల సమిష్టి కృషి వల్ల నిందితుడికి జైలు శిక్ష పడిం దని మహిళా భద్రతా విభాగం లావణ్య జాదవ్ నాయక్ తెలిపారు.

## ఆంధ్రా బ్యాంకు రుణాల మోసం కేసులో సౌభాగ్య ఇస్పాత్ కంపెనీ ఆస్తులు జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** బ్యాంకు రుణాల మోసం కేసులో ఈడీ అధికారులు హైదరాబాద్ జోనల్ అధికారులతో కలిసి సౌభాగ్య ఇస్పాత్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 26.86 కోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేశారు. జప్తు చేసిన ఆస్తుల్లో ఇళ్లతో పాటు ఇతర స్థలాలు వున్నాయి. గతంలో ఆంధ్రా బ్యాంకుగా వున్న సమయంలో (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను మోసం చేసి సదరు కంపెనీ భారీగా రుణం పొందినట్లు ఈడీ గుర్తించింది. స్టీల్ ఉత్పత్తి కోసం యూనిట్ ఏర్పాటు, దీని విస్తరణ పేరిట కంపెనీ డైరెక్టర్లు బ్యాంకు నుంచి టర్మ్ రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ తీసుకున్నారు. ఇందుకోసం నకిలీ స్టాక్ స్టేట్‌మెంట్లతో పాటు, తప్పుడు ఆర్థిక నివేదికలు, ఫోర్జరీ పత్రాలను బ్యాంకు సమర్పించారు. ఇలా తీసుకున్న రుణాలను వ్యాపార అవసరాలకు వాడకుండా, ఇతర మార్గాలలో దారి మళ్లించినట్లు ఈడీ తేల్చింది. ఇదే సమయంలో కంపెనీ టర్నోవర్‌కు కృత్రిమంగా పెంచారు. ఇలా మోసపూరితంగా 46.52 కోట్ల నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించారు. ఇందులో బ్యాంకు 15.52 కోట్ల రూపాయలను రికవరీ చేసింది. మిగిలిన మొత్తానికి 26.86 కోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేసింది.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ ఐఎఎస్ అధికారి చిరంజీవులు

## కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలి

### బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

### బిసి, ఎస్సీ, ఎస్టీ జెఎసి, రజక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 6, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఛైర్మన్ విశారదన్ మహరాజ్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగం కుమారస్వామిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మరియు రజకసంఘాల ఆధ్వర్యంలో కుమ్మెర బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ నిందితులపై మర్డర్ కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, అటెంప్ట్ మర్డర్, మహిళా వేధింపు కేసులు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో 8మంది
# భారత్ నుంచి ఒకే ఒక్కడు

**ముంబై:** టీ20 ప్రపంచకప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ రేసులో ఉన్న 8మంది పేర్లను ఐసీసీ విడుదల చేసింది. అందులో సంజు సాంమ్సన్ చోటు దక్కించుకున్నాడు. అతడితోపాటు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్, పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్, దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్, పేసర్ లుంగి ఎంగిడి, న్యూజిలాండ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర, బ్యాటర్ టిమ్ సీఫర్ట్, అమెరికా బౌలర్ వాన్ షాక్‌విక్ ఎంపికయ్యారు. వీరిలోంచి ఒకరిని అభిమానులే ఎన్నుకునే అవకాశాన్ని ఐసీసీ కల్పించింది. అందుకోసం తన వెబ్‌సైట్‌లో ఎంపిక చేసే ఆప్షన్ ఇచ్చింది.

సంజూ ఈ టోర్నీలో ఆడిన 4 మ్యాచ్‌ల్లో 77.33 సగటుతో 232 రన్స్ చేశాడు. స్ట్రైక్ రేట్ 201.73గా ఉంది. పాకిస్తాన్ ఓపెనర్ ఆడిన 7 మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలతో సహా 76.63 సగటుతో 383 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ 226 పరుగులు, 9 వికెట్లు...న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర 128 పరుగులు, 11 వికెట్లు పడగొట్టారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్ 286 పరుగులు, న్యూజిలాండ్ ప్లేయర్ టిమ్ సీఫర్ట్ 274 పరుగులు, దక్షిణాఫ్రికా బౌలర్ లుంగి ఎంగిడి 12 వికెట్లు, అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ స్కాల్క్విక్ 13 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ పోరు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరగనుంది.

# కప్ వదిలేసిన బ్రూక్

**ముంబై:** క్యాచెస్ విన్ మ్యాచెస్ ఏమో గానీ క్యాచ్ డ్రాప్ అయితే మ్యాచ్ గోవిందే. ఇదే వాంఖడేలో జరిగిన సెకండ్ సెమీస్‌లో గెలిచిన టీమిండియా, ఓడిన ఇంగ్లాండ్ మధ్య తేడా. అసాధ్యమైన క్యాచ్‌లను సుసాధ్యం చేయడం తోనే టీమిండియా గెలవగలిగింది. సులువైన క్యాచ్‌లను కూడా అందుకోలేక ఇంగ్లాండ్ ఇంటిముఖం పట్టింది. ఇంగ్లాండ్ కెప్టెన్ క్యాచ్‌ను కాదు వదిలేసింది కప్‌ను అని సోషల్ మీడియాతో తెగ వైరల్ అవుతోంది.



అక్షర్ పటేల్ స్టన్నింగ్ క్యాచ్

క్యాచ్ డ్రాప్... మ్యాచ్ డ్రాప్.. ఇది ఇంగ్లాండ్ కు వాంఖడేలో బాగా తెలిసొచ్చింది. కెప్టెన్ బ్రూక్ లాలీపాప్‌లా వచ్చిన క్యాచ్‌ను నేలపాలు చేయడంతో ఇంగ్లాండ్ భారీ మూల్యం చెల్లించుకుంది. అప్పటికే అభిషేక్ శర్మ అవుటయ్యాడు. సంజూ శాంమ్సన్ 15 పరుగుల వద్ద ఉన్నాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో అర్చర్ బౌలింగ్‌లో సంజూ మీడాన్‌లో ఇచ్చిన సులువైన క్యాచ్‌ను కూడా బ్రూక్ అందుకోలేకపోయాడు. దీంతో లైఫ్ లైన్ పొందిన సంజూ అదనంగా 74 రన్స్ చేశాడు. అంతేకాదు ఇషాన్ కిషన్‌తో విలువైన భాగస్వామ్యం నడిపాడు. ఒకవేళ బ్రూక్ క్యాచ్ అందుకుని ఉంటే టీమిండియా మరింత ఒత్తిడిలో పడేది. ఆ క్యాచే కాదు సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్ ఫీల్డింగ్ దారుణంగా ఉంది. పలు క్యాచ్‌లు చేజారాయి.

భారత ఇన్నింగ్స్‌లో సంజు క్యాచ్ చేజారడం కీలక మలుపైతే.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ క్యాచ్ ఇంకా గొప్ప టర్నింగ్ పాయింట్. బెతెల్‌తో కలిసి విలువైన భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పాడు జాక్స్. ఈ భాగస్వామ్యం ఇంకొంతసేపు కొనసాగితే మ్యాచ్‌పోయేదే. కానీ అర్ష్‌దీప్ వేసిన 14వఓవర్లో ఫుల్‌టాస్‌గా వచ్చిన చివరిబంతికి జాక్స్ కవర్స్‌లో భారీ షాట్ ఆడాడు. చాలాదూరం నుంచి పరుగెత్తుకుని వచ్చిన అక్షర్..అద్భుత రీతిలో బంతిని అందుకున్నాడు. కానీ ఆ పరుగులో తనను తాను నియంత్రించు కోలేకపోయిన అక్షర్.. చురుగ్గా స్పందించి తన ముందే ఉన్న దూబె వైపు బంతి విసరగా



అతను క్యాచ్ అందుకున్నాడు. క్యాచ్ పట్టింది దూబెనే అయినా.. ఘనత అక్షర్‌దే. అంతకుముందు ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్ గాల్లోకి లేపిన బంతిని పాయింట్‌లో ఉన్న అక్షర్ 28 మీటర్లు వెనక్కి పరుగెత్తి అక్షర్ అద్భుతంగా అందుకున్నాడు. తను ఔటైన విషయాన్ని కాసేపటి వరకు బ్రూక్ కూడా నమ్మలేకపోయాడు. నిజానికి బ్రూక్ ఈ ప్రపంచ కప్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. పాకిస్తాన్‌పై సెంచరీ సాధించాడు. బ్రూక్ అవుటవడంతో ఇంగ్లాండ్ ఒత్తిడికి గురైంది. మొత్తానికి క్యాచ్‌లు నేలపాలు చేసి ఇంగ్లాండ్ ఇంటిదారి పడితే... భారత ఫీల్డర్లు అద్భుతంగా ఒడిసిపట్టడంతో టీమిండియా ఫైనల్ చేరింది.



# సంజూ సునామీ.. ఎవరాపగలరు?

**అహ్మదాబాద్:** సంజూ సాంమ్సన్... ఈ పొట్టి ప్రపంచకప్‌లో మార్మోగుతున్నపేరు. రెండే రెండు ఇన్నింగ్స్‌లు అతన్ని స్టార్‌ను చేశాయి. అప్పటివరకు రిజర్వ్‌బెంచ్‌కే పరిమిత మైన సంజూ సాంమ్సన్... నాకౌట్ స్టేజ్‌లో అదరగొడుతున్నాడు. సూపర్8 గట్టెక్కాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో మాస్టర్ క్లాస్ చూపాడు. జింబాబ్వేపై 24 రన్స్, ఆ తర్వాత వెస్టిండీస్‌పై 97 రన్స్ చేసి భారత్‌ను సెమీస్‌కు చేర్చిన కేరళ తంబి...ఇంగ్లాండ్‌పై అదే జోరు చూపి కప్‌కు దగ్గరచేర్చాడు.

32 ఏళ్ల సంజూ విశ్వనాథ్ సాంమ్సన్... పొట్టి ఫార్మాట్‌లో విలువైన ప్లేయర్, మూడు సెంచరీలు అతని ఖాతాలో ఉన్నాయి. అయినా టీ20 ప్రపంచకప్‌కు జట్టులో స్థానమే డైలమాలోపడింది. కారణం న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20ల సిరీస్‌లో పేలవఫామ్. 6, 24, 0, 6, 10.. ఇలా 5 మ్యాచ్‌ల్లో 46 రన్స్ మాత్రమే చేశాడు. అయితే రిజర్వ్ ఓపెనర్‌గానే టీ20ప్రపంచకప్‌కు సంజూ వచ్చాడు. అందుకనుగుణంగా గ్రూప్ స్టేజ్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ సంజూకు తుది జట్టులో చోటు దక్కలేదు. అభిషేక్ శర్మ విఫలమైనా టీమ్ మేనేజ్‌మెంట్ అతనివైపే మొగ్గు చూపడంతో సంజూ రిజర్వ్‌బెంచ్‌కే పరిమితమవ్వాల్సి వచ్చింది.

దక్షిణాఫ్రికాతో సూపర్8 తొలి మ్యాచ్‌లోనూ సంజూకు చోటు దక్కలేదు. ఆ మ్యాచ్‌లో టీమిండియా ఓడడంతో మిగతా రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. దీంతో బ్యాటింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు.. ఓపెనింగ్ లెఫ్ట్, రైట్ కాంబినేషన్ ఉండాలనే ఉద్దేశ్యంతో సంజూ తుది జట్టులోకి వచ్చాడు.

జింబాబ్వేపై ఆడింది కొద్దిసేపే అయినా సంజూ సాంమ్సన్ కసికొద్ది బాదాడు. రెండు సిక్స్‌లతో వేగంగా 24 రన్స్ చేశాడు. ఇక వెస్టిండీస్ మ్యాచ్‌లోనైతే జూలు విదిల్చాడు. టార్గెట్ ఛేజింగ్‌లో విండీస్ బౌలర్లపై సంజూ విరుచుకుపడ్డాడు. కేవలం 50 బంతుల్లోనే 97 రన్స్‌తో అజేయంగా నిలిచి భారత్‌ను సెమీఫైనల్ చేర్చాడు. ఇక వాంఖడేలో అతనికి ఆకాశమే హద్దయింది. విండీస్‌పై ఆటను కంటిన్యూ చేస్తూ 89 రన్స్ సాధించాడు. ఈ రెండు ఇనింగ్స్‌లతో ఇపుడు సంజూ ఫేవరెట్‌గా మారాడు. న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్లోనూ అతనిపై అంచనాలు పెరిగాయి.

## ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్
# అరవింద్ సంచలనం



**ఫరాగ్వే:** ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అరవింద్ చిదంబరం సంచలనం సృష్టించాడు. 8వ రౌండ్‌లో టాప్‌సీడ్ వాన్ ఫారెస్ట్‌ను 62ఎత్తుల్లో ఓడించాడు. నల్లపావులతో ఆడిన అరవింద్... చక్కని ఎత్తులతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. భారత గ్రాండ్ మాస్టర్ మిడిల్ గేమ్‌లో అనూహ్య ఎత్తు వేశాడు. బంటు కోసం తన క్వీన్‌ను త్యాగంచేసే ప్రమాదకర ఎత్తుగడ వేశాడు. ఈ ఉచ్చులో చిక్కుకున్న వాన్ ఫారెస్ట్ చివర్లో తప్పు ఎత్తు వేసి ఇరుక్కున్నాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ అరవింద్ పైచేయి సాధించాడు. దీంతో వాన్ 62 మూవ్‌ల తర్వాత ఓటమిని అంగీకరించి గేమ్‌నుంచి వైదొలిగాడు. ఈ విజయంతో అరవింద్ 4పాయింట్లతో మరో ఇద్దరితో నాలుగో స్థానానికి చేరాడు.

ఇక ప్రపంచ ఛాంపియన్ గుకేష్ నిరాశజనక ఆటతీరు కొనసాగుతోంది. ఇప్పటివరకు గెలుపు లేకుండా కొనసాగుతున్నాడు. 8వ రౌండ్‌లో మరో డ్రాతో సరిపెట్టాడు. గుకేష్ 2.5 పాయింట్లతో చివరన ఉన్నాడు. ఇప్పటివరకు ఐదు డ్రాలు, మూడు ఓటములు నమోదుచేశాడు.



టెస్ట్ అరంగేట్రం చేసిన విమెన్ క్రికెటర్లు కాశ్వీ గౌతమ్, క్రాంతి గ్రాడ్, ప్రతీక రావల్, సయాలీ సత్ఘారే

# భారత్ ఉమెన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 198 ఆలౌట్

**పెర్త్:** పింక్ బాల్ టెస్టులో భారత విమెన్స్ తడబడ్డారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఏకైక టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆరంభంలోనే స్మృతి మంధాన(4) వికెట్ కోల్పోయింది. షెఫాలీ వర్మ (35), ప్రతీకా రావల్(18) ఆదుకున్నారు. స్వల్ప వ్యవధిలో ఇద్దరూ అవుట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19), దీప్తి శర్మ (7), రిచా ఘోష్ (11), స్నేహ్ రాణా (5) కూడా తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో జెమీమా రోడ్రిగ్స్ (52) నిలకడగా ఆడింది. ఈ క్రమంలో టెస్టు కెరీర్‌లో నాలుగో హాఫ్ సెంచరీ పూర్తి చేసింది. ఆఖర్లో కాశ్వీ గౌతమ్ (34) అజేయంగా నిలిచింది. ఆసీస్ బౌలర్ అన్నాబెల్ సదర్లాండ్ (4/46) భారత్‌ను కట్టడిచేసింది. హమిల్టన్ 3, బ్రౌన్ 2, గార్డెనర్ ఒక వికెట్ తీశారు.

తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా మొదటి రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. పెర్రీ (43), అన్నాబెల్ సదర్లాండ్ (20) క్రీజ్‌లో ఉన్నారు. ఓపెనర్ జార్జియా వోల్ (2), ఫోయబ్ లిట్చ్‌ఫీల్డ్ (9), హీలే (13) విఫలమయ్యారు. భారత బౌలర్లలో సయాలి 2, క్రాంతి ఒక వికెట్ తీశారు. ఆసీస్ ఇంకా 102 పరుగులు వెనుకబడి ఉంది.

# విద్యుత్ వాహనాల్లో రికార్డుసేల్స్!

**ముంబయి, మార్చి 6:** భారత్‌లో విద్యుత్ వాహనాల విక్రయాలు గతనెలలో భారీగాపెరిగాయిప్రత్యేకించి టూవీలర్లు 46శాతం వృద్ధిని నమోదుచేసాయి. ప్యాసింజర్ వాహనాలు 44శాతం వాణిజ్యవాహనాల్లో 156శాతం సేల్స్ పెరిగినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఫాడా వెల్లడించింది. ఇకత్రీవలర్లు 25శాతం పెరిగినట్లు తేలింది.



నెలవారీగాచూస్తే జనవరిలో పెరిగాయి. ఫిబ్రవరినెల తక్కువ రోజులు కావడంవల్లనే కొంతమేర తగ్గినట్లు కనిపిస్తుందని, వాస్తవానికి రికార్డుస్థాయిలో సేల్స్ జరిగినట్లు వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్, టివిఎస్ మోటార్స్ 67శాతం, బజాజ్ ఆటో 17శాతం అమ్మకాలుపెరిగాయి. ఏథర్ ఎనర్జీ 72శాతం హీరోమోటోకార్స్ 364శాతం అమ్మకాలు పెరిగితే గ్రీవ్స్ ఎలక్ట్రిక్‌మొబిలిటీ 28శాతం సేల్స్ పెంచుకోగలిగింది. టాప్‌ఫైవ్‌లో ఈ కంపెనీలే ఉన్నాయి. ఓలా కంపెనీ విక్రయాలు మందగించడంతో ఆరో స్థానానికి పడిపోయింది. ప్యాసింజర్ వాహనాలు 13,733 వరకూ విక్రయిం జరిగి 44శాతం శ1ద్ధినినమోదుచేసింది. టాటామోటార్స్, జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్స్, మహీంద్ర అండ్ మహీంద్ర, విన్‌ఫాస్ట్ ఆటో నాలుగుస్థానాల్లో నిలిచాయి. ఇక ఎలక్ట్రిక్ నరతీవీలర్లుకూడా 66,398 యూనిట్లు విక్రయాలు జరిగాయి. జనవరితో పోలిస్తే 25.09శాతం వృద్ధి నమోదుకాగా విద్యుత్ వాణిజ్యవాహనాలు 2051 యూనిట్లు విక్రయించి 156శాతం వాటాతో 2.03శాతం వృద్ధినమోదుచేసినట్లు ఫాడా వివరించింది.

# డాలర్ వర్సెస్‌రూపాయి 91.70

**ముంబయి, మార్చి 6:** వారాంతంలో డాలరుతోరూపాయి మారకం విలువలు ఊగిసలాడాయి. చివరకు ఆరుపైసలు క్షీణించి 91.70వద్ద ముగిసింది. ముడిచమురుధరలు పెరగడంతో ఆర్బీఐ జోక్యం అనివార్యం అయింది. విదేశీకరెన్సీ నిపుణుల ప్రకారం దేశీయ ఈక్విటీల్లో భారీగా అమ్మకాలుకొనసాగాయి. విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో విత్‌డ్రా కావడంతో రూపాయి క్షీణించింది. విత్‌డ్రాలన్నింటికీ డాలర్లలోనే చెల్లింపులుచేయడమే ఇందుకు కారణం. రూపాయీ భారీ క్షీణత కట్టడికి అమెరికానిర్ణయం కూడా కీలకమయింది. 30 రోజులపాటు రష్యా చమురు కొనుగోలుకు అమెరికా అంగీకరించడంతో చమురుధరలపై ఒత్తిడి తగ్గింది. హార్మోజ్ జలసంధినుంచి భారత్‌నౌకలకు ఎలాంటి ఇబ్బందిలేదని ఇరాన్‌సైతం ప్రకటించడం కూడా రూపాయి క్షీణతకు కొంత



బ్రేకులు వేయగలిగినట్లయింది. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడతూ ప్రపంచ ఇంధన సరఫరాపై ఇరాన్ కార్యాచరణ వల్లనే కొత్త ఒత్తిడిపెరిగిందని ఇపుడు సడలింపులు ఉన్నట్లు తెలిపారు. ప్రారంభంలో 91.64 వద్ద ట్రేడింగ్‌ప్రారంభించిన తర్వాత ఇంట్రేడాలో 91.54కు చేరింది. తదనంతరం క్రమేపీ ఊగిసలాడుతూ 91.78వద్దకు చేరింది. చివరకు 91.70వద్ద మారకం విలువలట్రేడింగ్‌ముగిసింది. అంతకుముందురోజుకంటే ఆరుపైలు క్షీణించింది. గురువారం ఏకంగా 41 పౌసలు రికవరీ అయింది. ఒకదశలో 97 పైసలునష్టపోయిన రూపాయి 41 పైసలు రికవరీచేసుకోగలిగింది. ద్రవ్యోల్బణం పెరగడం, కరెంటుఖాతా లోడు పెరగడం, సంక్లిష్టమైన మానిటరీ పాలసీ వంటివికూడా కొంత తోడయినట్లు రేటింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి.



# ఎస్‌బ్యాంకు ఎండిసిఇఒగా మురళీధర్ టోన్సే

**ముంబయి, మార్చి 6:** ఎస్‌బ్యాంకు ఎండిసిఇఒగా వినయ్ మురళీధర్ టోన్సే నియమితులయ్యారు. మేనేజింగ్‌డైరెక్టర్; చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఆయన మూడేళ్ల కాలం కొనసాగుతారు.

టోన్సే ఈనెల 12వ తేదీనుంచి ఎండిసిఇఒగా బాధ్యతలు స్వీకరి స్తారు. తాత్కాలిక బాధ్యతలు ఏప్రిల్ ఐదో తేదీవరకూ క ఒనసాగుతాయి. ఆ తర్వాత పూర్తికాలపు ఎండిసిఇఒగా బాధ్యతలు స్వీకరిస్తారని ఎస్‌బ్యాంకు యాజమాన్యం ప్రకటించింది.

## ఐదురోజుల్లో రూ.19 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
# సెన్సెక్స్,నిఫ్టీలకు ఇరాన్ వార్ ఎఫెక్ట్!



**ముంబయి, మార్చి 6:** అంతర్జాతీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికాఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఏడో రోజుకు చేరుకోవడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ విలవిల్లాడింది. ఐదురోజుల్లోనే మార్కెట్లలో రూ.19 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి అయిపోయింది. బిఎస్‌ఇలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువలు 468.28 లక్షలకోట్లనుంచి రూ.449.35 లక్షలకోట్లకు తగ్గిపోయింది. వారం రోజులుగా సెన్సెక్స్ 3329 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 1046 పాయింట్లు దిగజారింది. ఆయిల్ ధరలు భగ్గుమనడం, యుద్ధ భయాలతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు దిగడంతో సూచీలు కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ ఏకంగా 1,097 పాయింట్లు కోల్పోయి 78,918 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315 పాయింట్లు నష్టపోయి 24,450 వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 2.15 శాతం పతనమై 57,783 వద్దకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలను చవిచూశాయి. సెక్టార్ల వారీగా పరిశీలిస్తే ప్రైవేట్ బ్యాంక్, పిఎస్‌యు బ్యాంక్, రియల్టీ రంగాలు టాప్ లూజర్స్ గా నిలిచాయి. అయితే ఎఫ్‌ఎంసిజీ, ఐటీ రంగాలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. మరోవైపు యుద్ధ వాతావరణం కారణంగా డిఫెన్స్ షేర్లలో మాత్రం జోరు కనిపించింది. ఎన్‌ఎస్‌ఈలో పలు డిఫెన్స్ కంపెనీల షేర్లు, ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు 9 శాతం వరకు లాభపడటం గమనార్హం. ఇరాన్ క్షిపణి దాడులతో బహ్రెయిన్‌లోని ఆయిల్ రిఫైనరీ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతుండగా, అమెరికన్ క్రూడ్ 81 డాలర్లు దాటింది. హార్మోజ్‌మూసివేతతో బ్రెంట్‌ముడిచమురు 85 డాలర్ల రేంజ్‌కి చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.09 శాతం తగ్గి 91.70 వద్ద ముగిసింది. మార్కెట్లో అనిశ్చితి పెరగడంతో ఇండియా విక్స్ (వీఐఎక్స్) సూచీ 11 శాతం పెరిగింది.

# మార్కెట్లకు మూడు కొత్తఐపిఒలు!

**ముంబయి, మార్చి 6:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ ఈ వారంలో మూడు కొత్త ఐపిఒలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటిలో ఈస్ట్‌మాన్ ఆటో అండ్ పవర్, మైల్‌స్టెన్ గేర్స్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. వీటిలో రెండు కంపెనీలు కొత్తగా ఐపిఒకు రావడం, ఒఎఫ్‌ఎస్‌రూటులో కూడా ఉన్నాయి. బానబ్లాక్ టెక్నాలజీస్ ఐపిఒ రూ.230 కోట్లమేర వాటాలుజారీచేస్తున్నది. ఆఫర్‌ఫర్‌సేల్ రూటులో మూడు కోట్ల ఈక్విటీ వాటాలు విక్రయిస్తుంది. ఎన్‌ఎస్ఇ, బిఎస్‌ఇల్లో లిస్టింగ్‌చేస్తోంది. పాంతోమత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్‌గాను, కెఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రారుగాను వ్యవహరిస్తోంది. ఇతర కీలక వివరాలయిన ఐపిఒ తేదీలు, ఇష్యూధరలు వంటివి ప్రకటించాల్సి ఉంది. మైల్‌స్టోన్ గేర్స్ కంపెనీ రూ.1100 కోట్లు సమీకరించేందుకుగాను నిర్ణయించింది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో కూడా 300 కోట్లు జారీచేస్తుంటే కొత్తషేర్లు 800 కోట్లరూపాయలవరకూ జారీ చేస్తోంది. స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగ్ అవుతాయి. కెఫిన్ టెక్నాలజీస్ రిజిస్ట్రార్‌గా వ్యవహాటిస్తున్నది. ఐపిఒ తేదీలు, ధరలు వంటివి కూడా ఈ కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఈస్ట్‌మన్ ఆటో అండ్‌పవర్‌కంపెనీ కూడా సెబీ వద్ద గత ఏడాది డిసెంబరు 9న డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది.




ఐపిఒ తేదీలు, ఐపిఒ ధరలు లాట్‌సైజు వంటివి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ ఆఫర్ ఒక బుక్‌బిల్ట్ ఇష్యూగా నిలుస్తుంది. యాక్సిస్‌క్యాపిటల్ బుక్‌రన్నింగ్‌మేనేజర్‌గా వ్యవహరిస్తోంది.

# రికార్డు గరిష్టానికి విదేశీ కరెన్సీ నిల్వలు!

**ముంబయి, మార్చి 6:** భారత్ విదేశీ కరెన్సీ రిజర్వులు రికార్డుస్థాయికి పెరిగాయి. గతనెల 27వ తేదీతోముగిసిన వారం రోజుల్లో 728.49 బిలియన్ డాలర్లకు పెరిగినట్ల ఆర్బీఐ ప్రకటించింది. మొత్తం రిజర్వులు 4.88 బిలియన్ డాలర్లమేర పెరిగాయని, వీటిలో బంగారం నిల్వలు, విదేశీ కరెన్సీ ఆస్తులు వివరాలు కూడా ఉన్నాయి. అంతకుముందు వారంలో 726 బిలియన్‌డాలర్లు కూడా చేరుకన్న సంఘటనలున్నాయి. గతనెల 13వ తేదీతో ముగిసిన వారంలోనే రికార్డుస్థాయి వివరాలున్నాయి. బంగారం రిజర్వులు కూడా 4.14 బిలియన్‌డాలర్లుపెరిగి 131 బిలియన్‌డాలర్లుగా ఉన్నాయి. బంగారంధరలు 3.36శాతంపెరిగి




ఔన్స్ ఒక్కింటికి 5,278డాలర్లుగా ఉన్నాయి. విదేశీ కరెన్సీ ఆస్తులుక ఊడా 561 మిలియన్ డాలర్లు పెరిగాయి. డాలరేతర కరెన్సీల్లో హెచ్చుతగ్గులు తేడాలు ఇందుకుకీలకం అయ్యాయి. యూరో, పౌండ్ స్టెర్లింగ్, యెన్ వంటి వాటి విలువల్లో తేడాలనే ఆస్తులుగాపరిగణిస్తారు. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 26 మిలియన్ డాలర్లుపెరిగి 18.86 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్‌వద్ద భారత్ రిజర్వుస్థాయి 158 మిలియన్ డాలర్లు పెరిగి 4.87 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ విదేశీ కరెన్సీ రిజర్వులు 63 బిలియ్ డాలర్లుపెరిగినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.